
Crime Mirror QR Code
https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
14-12-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:13
సంచిక: 31

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## విద్యారంగంలో సంస్కరణలు తప్పవు

ఇప్పుడు అమలు చేయకపోతే విద్యావ్యవస్థ మనుగడకే ప్రమాదం

ఉపాధ్యాయ సంఘాలతో భేటీలో లోకేశ్

2లో



## ఫార్ములా-ఈ కేసులో కేటీఆర్‌కు త్వరలో నోటీసులు!

### రంగం సిద్ధం చేస్తున్న ఏసీబీ

హైదరాబాద్: ఫార్ములా-ఈ రేస్ కోసం విదేశీ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.46 కోట్లు బదలాయించారన్న కేసు దర్యాప్తులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు త్వరలో నోటీసులు జారీ చేయనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.



# అల్లు అర్జున్ అరెస్టు

## అల్లు అర్జున్‌కు హైకోర్టులో ఊరట

## మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన కోర్టు

- పుష్ప అరెస్ట్.. 14 రోజుల రిమాండ్
- గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు
- చంచల్‌గూడ జైలుకు తరలింపు
- హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్
- సోమవారం విచారిస్తామన్న హైకోర్టు
- పుష్ప అరెస్ట్‌పై పిటిషనర్ ఆందోళన
- కేసు ఉపసంహరించుకుంటానని వీడియో విడుదల

**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** సినీ నటుడు అల్లు అర్జున్ వ్యవహారంలో రోజంతా హైడ్రామా నడిచింది. ఆయనను అరెస్ట్ చేయడం, చంచల్‌గూడ జైలుకు తరలించడం, వెంటనే హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడం వంటివన్నీ చకచకా సాగిపోయాయి.

మిగతా 2లో

### అల్లు అర్జున్ అరెస్ట్ అప్రజాస్వామికం

బట్టలు కూడా వేసుకోనీయకపోవడం దారుణం

మండిపడ్డ హోంశాఖ సహాయమంత్రి బండి

# నిధుల విడుదలలో కేంద్రం చొరవ చూపాలి



- పెండింగ్ లో ఉన్న రూ. 1800 కోట్లు తక్షణమే ఇవ్వండి
- ఏపీ నుండి వచ్చే రూ.408 కోట్లను ఇప్పించండి
- రూ. 2,547.07 కోట్ల రికవరీ ఆదేశాలు ఏకపక్షంగా ఉన్నాయి
- మరోసారి సమీక్షించి కేంద్ర ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలి
- నిర్మలా సీతారామన్ ను కోరిన సీఎం రేవంత్ రెడ్డి
- తెలంగాణకు రావాల్సిన నిధులు అందేలా చూడాలని వినతి
- కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి వరుస భేటీలు
- కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ తో భేటీ
- పెండింగ్ రైల్వే ప్రాజెక్ట్ లపై సీఎం చర్చ
- కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీకై విజ్ఞప్తి

**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** తెలంగాణకు రావాల్సిన నిధులు అందేలా చూడాలని కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులను కలిశారు. ఈ సంధర్భంగా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక అంశాలపై సుధీర్ఘంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో కేంద్రం చొరవ చూపాలని సీఎం ప్రత్యేకంగా కేంద్రాన్ని కోరారు. రాజస్థాన్ పర్యటన పూర్తి చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అయ్యారు. ప్రధానంగా తెలంగాణ నిధులు, రైల్వే ప్రాజెక్ట పూర్తి, పలు అంశాలపై సీఎం రేవంత్ సుధీర్ఘ చర్చలు జరిపారు.

- మిగతా 2వ పేజీలో



## జస్టిస్ చంద్రచూడ్‌పై మొయిత్రా విమర్శలు

లోక్‌సభలో తీవ్ర కలకలం

జడ్జి మృతి ప్రస్తావనపై రగడ
చర్యలు తప్పవన్న రిజిజు

2లో

## అత్యంత శక్తిమంతమైన మహిళగా నిర్మలమ్మ

భారత్ నుంచి ముగ్గురు మహిళలకు చోటు

ఫోర్బ్స్ 2024 జాబితా విడుదల

## రాజ్యాంగం అంటే సంఘ్ రూల్ బుక్ కాదు!

- ఇది ప్రధాని మోదీకి ఇంకా అర్థం కానట్లుంది.. స్వేచ్ఛ, న్యాయానికి రాజ్యాంగమే రక్షా కవచం
- దాన్ని బద్దలు కొట్టడానికి బీజేపీ చేయని ప్రయత్నం లేదు
- రాజ్యాంగంపై చర్చలో ప్రియాంక
- రాజ్యాంగాన్ని హైజాక్ చేయడానికి కాంగ్రెస్ యత్నం: రాజ్‌నాథ్‌సింగ్

న్యూఢిల్లీ: భారత రాజ్యాంగం అంటే 'సంఘ్' రూపొందించిన నియమాలు, విధానాల పుస్తకం కాదన్న విషయం ప్రధాని





## కాంట్రాక్టు ఏఎన్ఎంలను తొలగించం

వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీ

ప్రస్తుత ఏఎన్ఎం నోటిఫికేషన్‌కు మరో 323 పోస్టులు

29న ఏఎన్ఎం రాత పరీక్ష యథావిధిగా జరుగుతుందని వెల్లడి

## మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురు


ముందస్తు బెయిల్ పిటిషన్ వాయిదా

జర్నలిస్టుపై దాడి ఘటనలో కేసు నమోదు

**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** నటుడు మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురైంది. జర్నలిస్టుపై దాడి ఘటనలో మోహన్‌బాబు వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్?పై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయస్థానం తిరస్కరించింది. జల్?పల్లిలోని మోహన్ బాబు ఇంటి వద్ద జరిగిన ఘర్షణపై



మిగతా 2లో



## చుక్కల్ని తాకిన టమాటా, మిర్చి ధరలు

చెత్తలో పారబోస్తున్న రైతులు

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** నిన్న మొన్నటి వరకు రూ.60-70 ఓ దశలో రూ.100 రుపాయలకు చేరువైన కిలో టమాటాను ఇప్పుడు వ్యవసాయ మార్కెట్లలో కనీసం రుపాయి ధరకి కూడా కొనడం లేదు.






# అల్లు అర్జున్ అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

అరెస్ట్ చేసి జైలుకు తరలించిన అనంతరం తెలంగాణ హైకోర్టులో అల్లు అర్జున్‌కు ఊరట లభించింది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో ఆయన అరెస్టయిన క్రమంలో అల్లు అర్జున్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం నాలుగు వారాల పాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అల్లు అర్జున్ ఏ11గా పేర్కొన్న పోలీసులు.. మధ్యాహ్నం 1.30కి అరెస్టు చేసినట్లు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. క్వాష్ పిటిషన్‌పై విచారణ అత్యవసరం కాదని.. సోమవారం వినాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టును కోరారు. అల్లు అర్జున్ అరెస్టయినందున బెయిల్ కోసం అవసరమైతే మరో పిటిషన్ వేసుకోవాలన్నారు. క్వాష్ పిటిషన్‌లోనే మధ్యంతర బెయిల్ ఇవ్వాలని అల్లు అర్జున్ తరఫు న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు.'అల్లు అర్జున్ తన ప్రతి సినిమా విడుదల రోజున థియేటర్‌కు వెళ్తారు. థియేటర్ యాజమాన్యం, నిర్మాత పోలీసులకు సమాచారం ఇచ్చారు. అల్లు అర్జున్ రాత్రి 9.40కి సంధ్య థియేటర్‌కు వెళ్లి మొదటి అంతస్తులో కూర్చున్నారు. తొక్కిసలాటలో మరణించిన మహిళ కింద అంతస్తులో ఉన్నారు' అని అల్లు అర్జున్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. మధ్యాహ్నం అడగ్గానే లంచ్ మోషన్‌కు అనుమతివ్వడం తప్పుడు సంకేతం ఇస్తుందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు. క్వాష్ పిటిషన్‌లో మధ్యంతర బెయిల్ ఇవ్వొచ్చా? లేదా? అనే అంశంపై వాదించాలని ఈ సందర్భంగా హైకోర్టు పీపీకి సూచించింది. థియేటర్‌కు వెళ్లొద్దని అల్లు అర్జున్‌కు పోలీసులు ముందుగానే సమాచారం ఇచ్చారని పీపీ కోర్టుకు తెలిపారు. భారీగా జనం ఉంటారని తెలిసినప్పటికీ అల్లు అర్జున్ వెళ్లారని వివరించారు. మధ్యంతర బెయిల్ ఇవ్వాలని క్వాష్ పిటిషన్‌లో ఎక్కడా కోరలేదని పీపీ వాదనలు వినిపించారు. క్వాష్ పిటిషన్‌పై అత్యవసర విచారణ అవసరం లేదని, సోమవారం విచారించాలని కోరారు. పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ తగిన భద్రత ఇవ్వలేదని అల్లు అర్జున్ న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. పోలీసులు కూడా భద్రత కన్నా అల్లు అర్జున్‌ను చూసేందుకే ఎక్కువ ఉత్సాహం చూపారని తెలిపారు. అల్లు అర్జున్ భద్రత సిబ్బంది తోయడంతోనే తొక్కిసలాట జరిగినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు దారుడి భార్య మరణించింది. కుమారుడు వెంటిలేటర్‌పై ఉన్నాడని పీపీ కోర్టుకు వివరించారు. అందుకే అల్లు అర్జున్‌కు ఎలాంటి ఊరట ఇవ్వొద్దని పీపీ తన వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'ఎఫ్ఐఆర్‌ను పూర్తిగా కొట్టివేయాలని పిటిషన్ వేశాం. పిటిషన్‌పై విచారణ కొనసాగుతుండగానే అరెస్టు చేశారు. అందువల్ల ఈ పిటిషన్ ద్వారానే మధ్యంతర బెయిల్ ఇవ్వొచ్చని గతంలో సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నందున మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరారు. అర్ణబ్ గోస్వామి, మహారాష్ట్ర ప్రభుత్వం కేసులో బాంబే కోర్టు ఇచ్చిన తీర్పును ఉదహరించడంతో వాటి ఆధారంగా హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జైలు సూపరింటెండెంట్ కు రూ.50వేల వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. కేసు దర్యాప్తును, సాక్షులను ప్రభావితం చేయవద్దని అల్లు అర్జున్‌ను ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. రెగ్యులర్ బెయిల్ కోసం నాంపల్లి కోర్టును సంప్రదించాలని సూచించింది. అంతకుముందు తొక్కిసలాట ఘటనలో అరెస్టయిన అల్లు అర్జున్‌కి బిగ్‌షాక్ తగలింది. ఆయన్ను 14 రోజుల రిమాండ్‌కు తరలించాలని నాంపల్లి కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీచేశారు. దీంతో అతడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. బన్నీ రావటం వల్లే తొక్కిసలాట ఘటన జరిగిందనీ, అందుకే ఆయన్ను అరెస్టుచేశామని పోలీసులు కోర్టుకు నివేదించారు. పోలీసుల వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి అర్జునుకి రిమాండ్ విధించారు. అనంతరం చంచల్‌గూడ జైలుకు తరలించారు. చిక్కడపల్లి పోలీసులు శుక్రవారం నాడు ఆయన ఇంటి వద్ద అరెస్ట్ చేశారు. పుష్ప-2 విడుదల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. అరెస్టు చేయడానికి తన ఇంటికి వచ్చిన పోలీసులకు అల్లు అర్జున్ సహకరించి స్టేషన్‌కు వచ్చారు. ఇప్పటికే సంధ్య థియేటర్ యజమానితోపాటు అక్కడ సెక్యూరిటీ వారిని కూడా పోలీసులు అరెస్ట్‌చేశారు. వైద్య పరీక్షల కోసం అల్లు అర్జున్ ను ఉస్మానియా ఆసుపత్రికి తీసుకుకెళ్లారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో అరెస్టయిన అల్లు అర్జున్‌కు వైద్య పరీక్షలు ముగిశాయి. అనంతరం ఆయన్ను పోలీసులు నాంపల్లి క్రిమినల్ కోర్టులో హాజరు పరిచేందుకు తరలించారు. గాంధీ ఆస్పత్రిలో అల్లు అర్జున్‌కు బీపీ, షుగర్ పరీక్షలతో పాటు, కొవిడ్-19 టెస్ట్ కూడా చేసినట్లు ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్ తెలిపారు. అన్ని పరీక్షల్లో ఆయనకు సాధారణ ఫలితాలు వచ్చాయని వెల్లడించారు. ఈసీజీ పరీక్షలు కూడా నిర్వహించామని, భద్రతా కారణాల రీత్యా ఆయనను సూపరింటెండెంట్ కార్యాలయంలో వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం పోలీసులు ఆయన్ను నాంపల్లి క్రిమినల్ కోర్టుకు తరలించారు. అరెస్ట్ అంశంలో చట్టప్రకారం ముందుకెళ్తున్నామని పోలీసులు తెలిపారు. వైద్య పరీక్షల సందర్భంగా గాంధీ ఆస్పత్రికి వచ్చిన అల్లు అర్జున్‌ను చూసేందుకు ఆయన అభిమానులు, రోగులకు సహాయంగా వచ్చిన వారి బంధువులు ఎగబడ్డారు. ఫొటోలు, వీడియోలు తీస్తూ కనిపించారు. ఆస్పత్రి సిబ్బంది కూడా అల్లు అర్జున్‌ను ఫొటోలు తీసేందుకు ఆసక్తి చూపారు. అనంతరం నాంపల్లి కోర్టుకు హాజరుపర్చారు. అల్లు అర్జున్‌పై పలు సెక్షన్లలో కేసు నమోదైంది. దీంతో ఆయన తరపు న్యాయవాది హైకోర్టుని ఆశ్రయించారు.

## అల్లు అర్జున్ అరెస్ట్ అప్రజాస్వామికం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): సినీ నటుడు అల్లు అర్జున్ అరెస్టుపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. జాతీయ అవార్డు గ్రహీత అల్లు అర్జున్‌ను అరెస్టు చేసిన తీరు సరైనది కాదని మండిపడ్డారు. నేరుగా బెడ్‌రూంలోకి వచ్చి అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. బట్టలు కూడా మార్చుకోనివ్వకుండా అరెస్టు చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లు అర్జున్ భారత సినిమాకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చారని బండి సంజయ్ తెలిపారు. అలాంటి వ్యక్తితో కాస్త మర్యాదగా వ్యవహరించాల్సిందని అభిప్రాయపడ్డారు. సంధ్య థియేటర్‌లో తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందడం నిజంగా విచారకరమని తెలిపారు. కానీ ఆ తొక్కిసలాట పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే జరిగిందని ఆరోపించారు. పుష్ప ది రైజ్ ఘన విజయం తర్వాత పుష్ప 2కి విపరీతమైన క్రేజ్ వచ్చిందని.. ఆ సినిమా మీద భారీ అంచనాలు ఏర్పడ్డాయని బండి సంజయ్ తెలిపారు. అలాంటి సమయంలో ఏర్పాటు చేసిన ఈవెంట్‌కు సరైన ఏర్పాట్లు చేయకపోవడం నిజంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే అని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదని చెప్పారు. ఈ ఘటనలో అల్లు అర్జున్‌ను నేరస్తుడిగా చూడొద్దని.. ఆయనకు కనీస గౌరవం ఇవ్వాలని హితవు పలికారు. తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన కేసులో అల్లు అర్జున్‌ను ఇవాళ మధ్యాహ్నం చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ప్రత్యక్ష సాక్షి ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా సుమారు రెండు గంటల పాటు అల్లు అర్జున్‌ను పోలీసులు విచారించారు. బన్నీ నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం చిక్కడపల్లి పీఎస్ నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. దీని తర్వాత నాంపల్లి కోర్టుకు తీసుకెళ్లారు. కాగా, అల్లు అర్జున్ అంశంలో చట్ట ప్రకారం ఫాలో అవుతున్నామని పోలీసులు తెలిపారు.

## నిధుల విడుదలలో కేంద్రం చొరవ చూపాలి

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ తో భేటీ కాగా, పెండింగ్ లో ఉన్న రైల్వే ప్రాజెక్ట్ లపై సీఎం చర్చించారు. అందులో కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని, వికారాబాద్ %-% కృష్ణ స్టేషన్ల మధ్య పూర్తిగా రైల్వే శాఖ వ్యయంతో నూతన రైలుమార్గం నిర్మించాలని కోరారు.అనంతరం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ తో భేటీ కాగా కీలక అంశాలపై చర్చ సాగింది. వెనకబడిన జిల్లాలకు పునర్విభజన చట్ట ప్రకారం ఇవ్వాల్సిన నిధులను వెంటనే తెలంగాణకు విడుదల చేసేలా చూడాలని కేంద్ర మంత్రికి సీఎం సూచించారు. నాలుగేళ్ల నుండి పెండింగ్ లో ఉన్న రూ. 1800 కోట్లు తక్షణం విడుదల చేయాలన్నారు. ఉమ్మడి సంస్థల నిర్వహణ వ్యయం రూ.408 కోట్లను ఆంధ్రప్రదేశ్ నుండి ఇప్పించాలని కేంద్రాన్ని కోరారు.విదేశీ ఆర్థిక సహాయంతో చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య రుణాల పంపిణీ విషయంలో తెలంగాణ నుండి ఏకపక్షంగా రూ. 2,547.07 కోట్ల రికవరీకి కేంద్రం ఏకపక్ష ఆదేశాల పై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు సీఎం. అలాగే ఈ విషయంలో మరోసారి సమీక్షించి సరైన నిర్ణయం తీసుకోవాలని వినతి పత్రాన్ని కూడా సీఎం అందజేశారు. అయితే కేంద్రాన్ని సీఎం కోరగా, సానుకూల స్పందన వచ్చినట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా తెలంగాణ పట్ల వివక్షత చూపకుండా, రాష్ట్రానికి రావాల్సిన నిధులు త్వరితగతిన అందేలా చూడాలని సీఎం కోరారు. సీఎం వెంట తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు కూడా భేటీలలో పాల్గొని తమ వాణి వినిపించారు.

## అత్యంత శక్తిమంతమైన మహిళగా నిర్మలమ్మ

న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్): ఫోర్బ్స్ 2024 సంవత్సరానికిగాను విడుదల చేసిన ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన మహిళల జాబితాలో భారత్ నుంచి ముగ్గురు మహిళలకు చోటు దక్కింది. వారిలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అగ్రస్థానం సంపాదించుకున్నారు. వాస్తవానికి ఫోర్బ్స్ జాబితాలో నిర్మలా సీతారామన్ ఉండడం వరుసగా ఇది ఆరోసారి కావడం గమనార్హం. ఫోర్బ్స్ - ప్రపంచవ్యాప్తంగా అత్యంత శక్తిమంతమైన 100 మంది మహిళల జాబితాలో నిర్మలా సీతారామన్ 28వ స్థానంలో నిలిచారు. గతేడాది ఆమె 32వ స్థానంలో ఉండగా, ఇప్పుడు మరో నాలుగు స్థానాలు ఎగబాకడం విశేషం. ఇక, భారత్ నుంచి హెచ్‌సీఎల్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా ఈ జాబితాలో 81వ స్థానం దక్కించుకున్నారు. గతేడాది ఈమె 60వ స్థానంలో ఉన్నారు. బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజూందర్ షా తాజా జాబితాలో 82వ స్థానంలో నిలిచారు. గతేడాది కూడా ఆమె ఫోర్బ్స్ శక్తిమంతమైన మహిళగా చోటు దక్కించుకున్నారు. ఫోర్బ్స్ జాబితాలో యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వాన్ దెర్ లెయెన్ మరోసారి అగ్రస్థానం దక్కించుకున్నారు. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ అధిపతి క్రిస్టినా లగార్డ్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని రెండు, మూడు స్థానాలను సొంతం చేసుకున్నారు. బిల్‌గేట్స్ మాజీ భార్య మిలిందా ఫ్రెంచ్ గేట్స్ (8వ స్థానం), అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్ మాజీ సతీమణి మెకంజీ స్కాట్ (9వ స్థానం), ప్రముఖ పాప్ గాయని టేలర్ స్విఫ్ట్ (23 వ స్థానం) లాంటివారు ఈ జాబితాలో ఉన్నారు. ఇండియాలో తొలి, పూర్తిస్థాయి ఆర్థికమంత్రి అయిన నిర్మలా సీతారామన్, రాజకీయాల్లోకి రాకముందు బ్రిటన్ అగ్రికల్చర్ ఇంజినీర్స్ అసోసియేషన్, బీబీసీ వరల్డ్ సర్వీస్‌లలో కీలక పదవులు నిర్వర్తించారు. హెచ్‌సీఎల్ వ్యవస్థాపకుడు శివ్‌నాడార్ కుమార్తె రోష్నీ నాడార్ మల్హోత్రా. జులై 2020లో హెచ్‌సీఎల్ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వ్యూహాత్మక నిర్ణయాలతో కంపెనీని అగ్ర పథంలో నడిపిస్తున్నారని ఫోర్బ్స్ తెలిపింది. 1978లో కిరణ్ మజూందర్ షా బయోకాన్‌ను నెలకొల్పారు. ఆ తర్వాత కాలంలో ఆమె భారత్‌లో అత్యంత సంపన్న మహిళల్లో ఒకరుగా ఎదిగారు. బయోకాన్‌కు మలేషియాలోని జొహెూర్‌లో ఆసియాలోనే అతిపెద్ద ఇన్సులిన్ పరిశ్రమ ఉంది.



## చుక్కల్ని తాకిన టమాటా, మిర్చి ధరలు

(మొదటి పేజీ తరువాయి)



ఏపీతో పాటు తెలుగు రాష్ట్రాల మార్కెట్లకు కర్నూలు, మదనపల్లి మార్కెట్ల నుంచి పెద్ద ఎత్తున టమాటా విక్రయాలు జరుగుతుంటాయి. మూడు నెలల క్రితం అకాల వర్షాలతో పంటలు నష్టపోవడంతో ధరలు అమాంతం పెరిగాయి. కొత్త పంట చేతికి వచ్చే సరికి ధరలు పడిపోయాయి. దీంతో కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్లో గురువారం టమాటా రైతులు ఆందోళనకు దిగారు. పత్తికొండ- గుత్తి రహదారిలో రైతుల ఆందోళనకు దిగారు. వ్యవసాయ మార్కెట్లలో టమాటా, మిర్చి ధరలు గురువారం ఒక్కసారిగా పడిపో యాయి. కిలో టమాటా రూపాయి కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతులు హతాశులై మార్కెట్లలో పారబోశారు. కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. దళారుల దోపిడీని నిరసిస్తూ పత్తికొండ- గుత్తి ప్రధాన రహదారిపై నిరసనకు దిగారు. నాణ్యత ఉన్న పంటకు గిట్టుబాటు ధర కూడా ఇవ్వకపోవడంతో రైతులు ఆగ్రహంతో రగిలిపోయారు. మార్కెట్లలో వ్యాపారులు కుమ్మక్కై తక్కువకు ధరలకు వేలం పాడుతుండటంపై రైతులు రగిలిపోయారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో టమాటా పంట ఒక్కసారిగా రావడంతో ధరలు ఒక్కసారి పడిపోయినట్టు మార్కెట్ యార్డు కార్యదర్శి చెబుతున్నారు. వారం రోజు లుగా టమాటా ధరల్లో హెచ్చుతగ్గులు ఉన్నా పూర్తిగా పడి పోలేదని నాణ్యతలేని పంటకు మాత్రమే వ్యాపారులు తక్కువ ధరకు అడిగారని తోటల్లో సాగు చేసిన టమాటా క్వింటాలు ధర రూ.1,800 వరకు పలికిందని మెట్ట భూముల్లో సాగు చేసిన పంట నాణ్యత దెబ్బతినడంతో తక్కువ ధర పలుకుతోందని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో రైతు బజార్లలో కిలో టమాటా ధర 25 గా ఉంది. కర్నూలు జిల్లా పత్తికొండ వ్యవసాయ మార్కెట్లో మాత్రం గురువారం కిలో ధర రుపాయి నుంచి 8 రూపాయల వరకు పలికింది. పత్తి కొండ వ్యవసాయ మార్కెట్‌లో నిత్యం 200 టన్నుల కొనుగోళ్లు జరుగుతాయి. పత్తికొండలో కొనుగోలు చేసిన వ్యాపారులు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లో కూడా పంటలు అందుబాటులోకి రావడంతో పత్తికొండ నుంచి ఎగుమతి అయ్యే టమాటాకు డిమాండ్ తగ్గింది. దీంతో వ్యాపారులు ధర తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. గురువారం మార్కెట్లో కనీస ధరలు కూడా లేకుండా కొనడంపై రైతులు ఆగ్రహంతో టమాటాలను మార్కెట్లోనే పారబోసి వెళ్లిపోయారు. కొందరు పత్తికొండ రహదారిపై ఆందోళనకు దిగారు. బాపట్ల జిల్లా సంతమాగులూరులో మిర్చి ధరను తగ్గించడంతో రైతులు రోడ్డుపై పారబోశారు. బహిరంగ మార్కెట్లో క్వింటాలు ధర రూ.3వేలు ఉంటే వ్యవసాయ మార్కెట్లో రూ.1200మాత్రమే చెల్లిస్తుండటంతో రైతులు పంటను చెత్తలో పారబోశారు.

## కాంట్రాక్టు ఏఎన్ఎంలను తొలగించం



హైదరాబాద్: రెగ్యులర్ ఉద్యోగులను నియమించి నప్పటికీ, కాంట్రాక్టు ఏఎన్ఎంలను ఉద్యోగాల నుంచి తీసేయబోమని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రిని ఏఎన్ఎంలు కలిసి తమ సమస్యలు విన్నవించారు. తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. అయితే ఈ అంశం కోర్టు పరిధిలో ఉందని మంత్రి తెలిపారు. ఏఎన్ఎం రెగ్యులర్ పోస్టుల భర్తీకి ఈ నెల 29న నిర్వహించనున్న పరీక్ష యథావిధిగా జరుగుతుందని స్పష్టం చేశారు.ఈ పరీక్షకు హాజరయ్యే కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు 30 మార్కులు వెయిటేజీ ఇస్తున్నామని గుర్తుచేశారు. పోస్టుల సంఖ్యను పెంచాలని ఏఎన్ఎంలు కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. ప్రస్తుతం నోటిఫికేషన్‌లో ఇచ్చిన 1,931 పోస్టులకు అదనంగా మరో 323 పోస్టులను కలిపి, ఇదే నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. రెగ్యులర్ ఉద్యోగం రానివారిని, చివరి వరకూ కాంట్రాక్ట్ ఉద్యోగంలో కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని ఏఎన్ఎంలు కోరగా, సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

## మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురు

పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో పోలీసులు తదుపరి దర్యాప్తు చేపట్టకుండా, తనను అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన పిటిషన్ వేశారు. అయితే మోహన్‌బాబు అభ్యర్థనను ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను న్యాయస్థానం గురువారానికి వాయిదా వేసింది.

## ఫార్ములా-ఈ కేసులో కేటీఆర్‌కు త్వరలో నోటీసులు!

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకోసం గవర్నర్ నుంచి అనుమతి లభించినట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పటికే విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్‌పై కేసు నమోదుకు ప్రభుత్వం అనుమతివ్వడం తెలిసిందే. హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ%-%రేస్ కోసం విదేశీ సంస్థకు హెచ్ఎండీఏ నుంచి బోర్డు అనుమతి లేకుండానే రూ.46 కోట్లను విదేశీ కరెన్సీ రూపంలో చెల్లించడం నిబంధనలకు విరుద్ధమని ప్రభుత్వం వాదిస్తోంది. ఈ నేపథ్యంలో పురపాలక శాఖ ఈ అంశంలో ఏసీబీ దర్యాప్తు చేయించాలని ప్రభుత్వానికి లేఖ రాయడం, దానిని ఏసీబీకి అప్పగించడం తెలిసిందే. నాడు కేటీఆర్ ఆదేశాల మేరకే తాను ఆ నిధులు చెల్లించానని అప్పుడు హెచ్ఎండీఏ కమిషనర్‌గా ఉన్న అర్వింద్‌కుమార్ ప్రభుత్వానికి ఇదివరకే స్పష్టం చేశారు. కేటీఆర్‌పై కేసు నమోదు చేసి, విచారణ చేయాలంటే గవర్నర్ అనుమతి తప్పనిసరి కావడంతో గత నెలలో ప్రభుత్వం అనుమతి కోరింది. దీనిపై న్యాయ సలహా తీసుకున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ.. కేసు నమోదుచేసి విచారణ జరిపేందుకు అనుమతిచ్చినట్లు తెలిసింది.

## విద్యారంగంలో సంస్కరణలు తప్పవు

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించడం లక్ష్యంగా సంస్కరణలు అమలుకావాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. సంస్కరణలు ఇప్పుడు అమలుచేయలేకపోతే రాబోయే పదేళ్లలో విద్యావ్యవస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్నారు. శుక్రవారం ఉండవల్లిలోని నివాసంలో ఉపాధ్యాయ సంఘాలతో ఆయన మొదటి సమావేశం నిర్వహించారు. పాఠశాల విద్యలోనే అనేక అంశాలపై దాదాపు నాలుగు గంటలపాటు వారితో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో ఉన్నట్టుగా తమకు ఎలాంటి పరదాలు ఉండవని, సీఎం నుంచి ఎమ్మెల్యే వరకూ అందరూ అందుబాటులో ఉంటారని తెలిపారు. సంస్కరణల అమలులో ఎక్కడైనా పొరపాట్లు జరిగితే వాటిని వెనక్కి తీసుకుంటామని పేర్కొన్నారు. అపార్ ఐడీల రూపకల్పనలో ఇబ్బందులు తలెత్తితే పరిష్కరించామని చెప్పారు. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతూ వస్తోందని, డ్రాపౌట్లు కూడా పెరుగుతున్నారని ఈ నేపథ్యంలో సంస్కరణలు అమలుచేయక తప్పదని స్పష్టం చేశారు. ఫలితాల విషయంలో ప్రైవేటు పాఠశాలలతో పోటీపడాలని నిర్దేశించారు.ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ప్రాథమిక పాఠశాలలపై మరింత శ్రద్ధ అవసరమన్నారు. రాష్ట్రంలో 20 కంటే తక్కువ మంది విద్యార్థులున్న బడులు 30 శాతం ఉన్నాయని, 300 పాఠశాలల్లో జీరో అడ్మిషన్లు వచ్చాయని తెలిపారు. యువగళం పాదయాత్రలో జీవో 117 తన దృష్టికి వచ్చిందని, చిన్నపిల్లలు నాలుగైదు కిలోమీటర్ల దూరం వెళ్లడం కష్టమని, అందుకే ఆ జీవోను రద్దుచేసి ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నామని వివరించారు. టీచర్లపై యాప్‌ల భారం తగ్గించామని, ఇంకా అమలులో ఉన్న విద్యేతర యాప్‌లను కూడా తొలగించే ప్రయత్నం చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. ఆంధ్రా మోడల్ విద్యా విధానం టీచర్లతోనే సాధ్యమని పేర్కొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో చంపేస్తోన్న చలి పులి

## తగ్గిన ఉష్ణోగ్రతలు.. వణుకుతున్న జనం

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలుగు రాష్ట్రాలనూ మంచు ముంచేస్తోంది. చలితీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. అటు దట్టమైన మంచుతో వాహనాలు, విమానాల రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో భారీగా పొగ మంచు కురుస్తోంది. పొగమంచుతో విమానాల రాకపోకలపై ప్రభావం పడుతోంది. బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ వెళ్లే విమానాలు ఆలస్యం అవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో పొగమంచు ప్రభావం రోజురోజుకీ ఎక్కువవుతోంది. ఇక మంచు ఎక్కువగా ఉండటంతో విమానాల రాకపోకలకు సైతం ఆటంకం కలుగుతోంది. ఆదిలాబాద్, అల్లూరి జిల్లాల్లో కనిష్ట స్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. రెండు రాష్ట్రాల్లోనూ కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యాయి. అటు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో అత్యల్పంగా 10 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రోజుల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఉత్తర, ఈశాన్య భారతం మీదుగా వీస్తున్న గాలుల ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతోంది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులను చలి వణికిస్తోంది. రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతల కారణంగా జిల్లా వ్యాప్తంగా మంచు కమ్మేసింది. ఆదిలాబాద్‌లో కనిష్ఠంగా 7.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. చలికి తోడు గాలులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మరోవైపు హైదరాబాద్‌లో చలిపంజా విసురుతోంది. దీంతో నగర వాసులు బయటకు వచ్చేందుకు వణుకుతున్నారు.. ఉదయం 9 దాటినా చలి తీవ్రత కొనసాగుతోంది.

# సినిమా వాళ్ల విషయంలో అతిగా స్పందన

### అల్లు అర్జున్ అరెస్ట్‌పై నాని

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** అల్లు అర్జున్ అరెస్ట్‌పై నటుడు నాని స్పందించారు. ఇది మనందరి తప్పు అని పేర్కొన్నారు. ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. 'సినిమా వాళ్లకు సంబంధించిన ఏ విషయంలోనైనా ప్రభుత్వ అధికారులు, మీడియా చూపించే ఉత్సాహం సాధారణ పౌరులపై కూడా ఉండాలని కోరుకుంటున్నా. మనం మంచి సమాజంలో జీవించాలి. అదొక దురదృష్టకర, హృదయ విదారక ఘటన. దీని నుంచి మనం ఎన్నో పాఠాలు నేర్చుకోవాలి. ఇకపై మరిన్ని జాగ్రత్తలు పాటించి భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలి. ఇక్కడ మనందరి తప్పు ఉంది. ఒక వ్యక్తిని నిందించడం కరెక్ట్ కాదు' అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. సినీ దర్శకుడు అజయ్ భూపతి సైతం అల్లు అర్జున్ అరెస్ట్‌ను ఖండించారు. ఇది ఏమాత్రం కరెక్ట్ కాదని ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'పుష్ప 2 ది రూల్' ప్రీమియర్ షోలో భాగంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో భాగంగా అల్లు అర్జున్‌ను ఈరోజు మధ్యాహ్నం పోలీసులు అరెస్ట్ చేశారు. సోషల్‌మీడియా వేదికగా నెటిజన్లు దీనిని ఖండిస్తున్నారు.

# అల్లు అర్జున్ అరెస్ట్ అక్రమం

## ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కెటిఆర్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్టుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. జాతీయ పురస్కారం అందుకున్న స్టార్‌ను అరెస్టు చేయడం పాలకుల అభద్రతా భావానికి ఇది పరాకాష్ట అని విమర్శించారు. సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట బాధితులకు పూర్తిగా సానుభూతి తెలుపుతాను.. కానీ ఘటనలో నిజంగా తప్పు చేసింది ఎవరని కేటీఆర్ ప్రశ్నించారు. ఘటనకు నేరుగా బాధ్యుడు కానీ అల్లు అర్జున్‌ను సాధారణ నేరగాడిలా ట్రీట్ చేయడం సరికాదని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ తీవ్ర చర్యను ఖండిస్తున్నానని తెలిపారు. హైడ్రా కూల్చివేతలతో ఇద్దరి చావుకు బాధ్యుడైన రేవంత్ రెడ్డిని కూడా ఇదే లాజిక్‌తో అరెస్టు చేయాలని సూచించారు. సంధ్య థియేటర్ తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన కేసులో ఇవాళ ఉదయం అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఆయనపై అల్లు అర్జున్‌పై బీఎన్ఎస్ 118 (1), బీఎన్ఎస్ 105, రెడ్‌విత్ 3/5 సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. 105 సెక్షన్ (నాన్ బెయిలబుల్ కేసు) కింద ఐదు నుంచి పదేళ్లు జైలు శిక్ష పడే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

# ఫార్ములా ఈ-కారు రేసు నిర్వహణలో కేటీఆర్‌పై అవినీతి ఆరోపణలు

### కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ ఆమోదం

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకోనుంది. ఫార్ములా ఈ-కారు రేసులో అవినీతి ఆరోపణల నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. దీంతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆయనను విచారించేందుకు సన్నద్ధం అవుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ వేదికగా గతేడాది ఫిబ్రవరిలో ఫార్ములా ఈ-కారు రేస్ జరిగిన విషయం తెలిసిందే. అయితే, ఈ ఫార్ములా ఈ-కారు రేసు నిధుల కేటాయింపులలో భారీ అవినీతి జరిగినట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ సంస్థ ఏసీబీకి ఫిర్యాదు చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటికే ఉన్న ఇద్దరు పురపాలక శాఖ అధికారులతో పాటు అప్పట్లో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్‌పై కేసు నమోదు చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఏసీబీ కాంగ్రెస్ ప్రభుత్వానికి లేఖ రాసింది. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఇద్దరు అధికారులపై విచారణకు అనుమతించింది. అలాగే ప్రజాప్రతినిధిగా ఉన్న కేటీఆర్‌పై కేసు నమోదు కోసం అనుమతి ఇవ్వాలని గవర్నర్‌ను కోరింది. దీనిపై న్యాయ సలహా మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కేటీఆర్‌ను విచారించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

# బేగంబజార్‌లో దారుణ ఘటన

### భార్యా కుమారుడి హత్య..ఆపై ఆత్మహత్య

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. ఓ భర్త తన భార్య గొంతు కోసి, కుమారుని గొంతు నులిమి హత్య చేశాడు. ఆపై అతను ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దారుణాన్ని మరో కుమారుడు చూశాడు. తల్లిని, తమ్ముణ్ణి చంపుతున్న సమయంలో భయాందోళనకు గురైన పెద్ద కుమారుడు తప్పించుకున్నాడు. సమాచారం తెలుసుకున్న బేగంబజార్ పోలీసులు క్లూస్ టీంతో సంఘటన ప్రదేశానికి చేరుకుని.. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. హత్యలకు పాల్పడి, ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మహమ్మద్ సిరాజ్ అలీ, భార్య హేలియ, కుమారుడు హైజాన్.. కుటుంబంలో భార్య, భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సిరాజ్ భార్య, కొడుకుని హత్య చేసిన తర్వాత సూసైడ్ నోటు రాసి ఉరి వేసుకున్నాడు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సిరాజ్ కుటుంబం.. బ్రతుకు దేరువు కోసం నగరానికి వచ్చారు. ఈ ఘటనకు కారణం తెలియరాలేదు. కాగా సూసైడ్ నోటులో ఏం రాశాడో తెలియదు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. అతను యూపి నుంచి వచ్చి ఇక్కడ సెటిల్ అయ్యాడని తెలుస్తోంది. అలాగే హైదరాబాద్ మియాపూర్‌లో విషాదం చోటు చేసుకుంది. నాగలక్ష్మి అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య చేసుకుంది. ఆన్ లైన్‌లో గుర్తు తెలియని మందు ఆర్డర్ చేసుకుని.. సేవించి ఆత్మహత్య చేసుకుంది. కాగా ఇటీవలే నాగలక్ష్మికి వివాహమైంది. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# చట్టం తనపని తాను చేసుకు పోతుంది

### అల్లు అరెస్ట్ విషయం తన ప్రమేయం లేదు

### మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేసిన ఘటన సంచలనంగా మారింది. అరెస్ట్ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించిన ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లు అర్జున్ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. ఇందులో తన జోక్యం ఏమీ ఉండదని.. చట్టం ముందు అందరూ సమానులేనన్నారు. చట్టపరమైన పక్రియ జరుగుతుందన్నారు. తొక్కిసలాటలో ఒకరు చనిపోయిన నేపథ్యంలో పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని.. మోహన్ బాబు విషయంలో కోర్టు ఉత్తర్వులు ఉన్నాయన్నారు. ఈ నెల 4న ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య థియేటర్‌లో పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా వచ్చారు. ఆ సమయంలోనే ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. ఈ క్రమంలో రేవతి అనే మహిళ మృతి చెందింది.ఆమె కుమారుడు గాయాలకు గురయ్యాడు. ఘటనలో మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు అల్లు అర్జున్‌తోపాటు పలువురిపై కేసులు నమోదు చేశారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో ముగ్గురిని అరెస్టు చేశారు. అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారు. అల్లు అర్జున్‌పై బీఎన్ఎస్ 118 (1), బీఎన్ఎస్ 105, రెడ్‌విత్ 3/5 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. రేవతి మృతిపై అల్లు అర్జున్ దిగ్భాం÷-రతి వ్యక్తం చేయడంతో పాటు ఆమె కుటుంబానికి రూ.25లక్షల సాయం ప్రకటించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ క్రమంలో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్టు అనంతరం గాంధీ ఆసుపత్రిలో పరీక్షలు చేశారు. ఆ తర్వాత ఆయనను కోర్టులో హాజరుపరుచనున్నారు. మరో వైపు పుష్ప స్టార్ తరఫు న్యాయవాదులు హైకోర్టును ఆశ్రయించారు.

# ఈనెల 29న కొమరవెల్లి మల్లన్న కల్యాణం

### 19 జనవరి 2025 నుంచి జాతర ప్రారంభం

### 10 ఆదివారాలపాటు కొనసాగనున్న జాతర

### రాష్ట్ర దేవాదాయశాఖ నిర్ణయం

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** సిద్దిపేట జిల్లా చేర్యాలలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామివారి కల్యాణం, జాతరలను వైభోవంగా నిర్ణయించాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. వేలాదిగా జాతరకు తరలివచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని ఏ చిన్న పొరపాటు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గురువారం డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ లో మంత్రి సురేఖ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ%ొ% గత సంవత్సరం కంటే మరింత వైభవోపేతంగా మల్లికార్జున స్వామివారి కల్యాణం, జాతరను నిర్వహించనున్నట్లు తెలిపారు.డిసెంబర్ 29 ఉదయం 10.45 గంటలకు మల్లికార్జున స్వామి వారి కల్యాణం జరగనుంది. జనవరి 19 నుంచి 10 వారాలపాటు మార్చి 23 వరకు జాతరను నిర్వహించేందుకు నిర్ణయించినట్లు మంత్రి సురేఖ ప్రకటించారు. ఈ దిశగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు.గత సంవత్సరం అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కల్యాణ వేదికను విశాలంగా తీర్చిదిద్దాలని ఈవోను మంత్రి సురేఖ ఆదేశించారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అమ్మవార్లు బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలకు కిరీటాల తయారీ పనులపై ఆరా తీశారు. రూ. 9.776 కోట్లు ఎస్డిఎఫ్ నిధులు, రూ. 36.18 కోట్ల దేవాదాయ శాఖ నిధులతో చేపడుతున్న కార్యక్రమాలను ఈవో.. మంత్రికి వివరించారు. కిరీటాల తయారీ పనుల పురోగతిలో వున్నట్లు తెలిపారు. భక్తుల క్యూలైన్లు, బారికేడ్లు, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, సిసి కెమరాల నిఘా, వివిఐపిలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు ఉండేలా చూడాలని మంత్రి సురేఖ దిశానిర్దేశం చేశారు. జాతర సమయానికి వేసవి కాలం రానుండటంతో భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, నడిచే మార్గాల్లో మ్యాట్లు, వృద్ధులు, వికలాంగులు, గర్భిణులకు బ్యాటరీ వాహనాలు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను సంపూర్ణంగా నిషేధించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రసాదం తయారీలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటించాలని మంత్రి అధికారులకు సూచించారు. జాతర జరుగుతున్నన్ని రోజులు సాయంత్రాల్లో కళాబృందాలచే ఒగ్గుకథ వంటి జానపద కళారూపాలను ప్రదర్శించేలా సాంస్కృతిక శాఖకు ఆదేశాలివ్వాలని కలెక్టర్ కు మంత్రి సూచించారు. కల్యాణోత్సవానికి వారం రోజుల ముందే సర్వసన్నద్ధంగా వుండేలా కార్యాచరణను వెంటనే అమలుపరచాలని సూచించారు.కల్యాణంతో పాటు, జాతర జరిగినన్ని రోజుల దేవాలయాన్ని దేదీప్యమానంగా ముస్తాబు చేయడంతో పాటు భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.



# పబ్‌లు, బార్లలో మైనర్లకు అనుమతి లేదు

### ఈవెంట్స్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరి

### వేడుకల్లో అశ్లీల నృత్యాలపై నిషేధం

### రాత్రి 10 తర్వాత లౌడ్ స్పీకర్లు బ్యాన్

### న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల ఆంక్షలు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్‌లో న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల ఆంక్షలు విధించారు. న్యూ ఇయర్ ఈవెంట్ నిర్వాహకులకు పోలీసులు కీలక హెచ్చరికలు జారీ చేశారు. ఈవెంట్స్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. వేడుకల్లో అశ్లీల నృత్యాలపై నిషేధం విధించారు. ఔట్‌డోర్‌లో రాత్రి 10 తర్వాత లౌడ్ స్పీకర్లు బ్యాన్ చేశారు. పబ్‌లు, బార్లలో మైనర్లకు అనుమతి లేదని హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. పార్టీల్లో డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని.. హైదరాబాద్ పోలీసులు వార్నింగ్ ఇచ్చారు. తాగి వాహనం నడిపితే 10 వేలు జరిమానా, 6 నెలలు జైలు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. మైనర్లు వాహనం నడిపితే యజమానిపైనా కేసు నమోదు చేస్తామన్న పోలీసులు.. ర్యాష్ డ్రైవింగ్‌పై వెహికల్ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే.. చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లోనే అత్యధికంగా కారు ప్రమాదాలు

### మెట్రో నగరాల్లో అత్యధికంగా ప్రమాదాలు

### వాహన బీమా సంస్థ ఆకో యాక్సిడెంట్? ఇండెక్స్ నివేదికలో వెల్లడి

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** దేశవ్యాప్తంగా మెట్రో నగరాల్లో గత రెండేళ్లలో హైదరాబాద్? మహానగరంలో అత్యధిక కారు ప్రమాదాలు జరిగినట్లు ప్రముఖ వాహన బీమా సంస్థ ఆకో యాక్సిడెంట్? ఇండెక్స్? -2024 పేరుతో తాజాగా నివేదికను విడుదల చేసింది. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా దేశ రాజధాని దిల్లీ, పుణె, బెంగళూరు, కోల్?కతా, ముంబయి, చెన్నై, అహ్మదాబాద్? నగరాలున్నాయని నివేదికలో పేర్కొంది. ఆ నివేదికలో ప్రస్తావించిన ప్రధానాంశాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం. దేశవ్యాప్తంగా 78 శాతం రోడ్డు ప్రమాదాలు మెట్రో నగరాల్లోనే జరుగుతున్నాయి. 2022లో అత్యధిక కారు ప్రమాదాల్లో దిల్లీ మొదటి స్థానంలో ఉంటే ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంది. దిల్లీలో పోల్చుకుంటే హైదరాబాద్‌లో 46శాతం కార్లు తక్కువ. అయినా గత రెండేళ్లలో హైదరాబాద్‌లోనే ఎక్కువగా ప్రమాదాలు జరిగాయి. హైదరాబాద్‌లో ప్రమాదాలను ఎక్కువ ఆస్కారమున్న ప్రాంతంగా మియాపూర్ నిలిచింది. దేశవ్యాప్తంగా ఆరో స్థానంలో ఉంది. బెంగళూరులోని బొమ్మనహళ్లి, దిల్లీలోని నోయిడా, పుణెలోని మరుంజి, ముంబయిలోని మిరారోడ్, చెన్నైలోని మెడవక్కం ప్రాంతాలు మొదటి 5స్థానాల్లో ఉన్నాయి. జంతువుల కారణంగా జరిగే గమనిస్తే శునకాలతో 62%, ఆవులతో 29%, బర్రెలతో 4%, కోతులతో 3%, మేకలతో 1% చొప్పున ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా నగర శివార్లలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అతివేగం, నిద్రలేమి, డ్రైవింగ్ చేసేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం ఇందుకు కారణాలుగా తెలుస్తున్నాయి. అలాగే మెట్రో నగరాలు ఎప్పుడు రద్దీగా ఉంటాయి. ఉరుకులు



పరుగుల సాగే రోడ్లపై ఎటు నుంచి ఎవరూ వస్తారో తెలియకపోవడం లాంటివి కూడా కారణాలుగా చెప్పుకోవచ్చు. చలికాలం కావడంతో తెల్లవారుజామున పొగమంచు కురుస్తుంటుంది. దీంతో రోడ్లపై ఏం వస్తున్నాయో లేదో అన్నది దగ్గరకి వస్తే కానీ తెలియదు. ఈ కారణంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఎక్కువే. అందుకు వాహనాలు నడిపించే వారు తగిన జాగ్రత్తలు పాటించాలని పోలీసులు చెబుతున్నారు. సూర్యోదయం అయ్యాకే రోడ్లపైకి రావాలని సూచిస్తున్నారు. పొగమంచు తగ్గిన తర్వాత ప్రయాణాలు చేయడం శ్రేయస్కరం అని అంటున్నారు.

# సభలో ప్రియాంక స్పీచ్ అదుర్స్

## నాకన్నా బాగా మాట్లాడిందంటూ..రాహుల్ కితాబు

**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** వయనాడ్ ఎంపీగా గెలిచి లోక్‌సభలో తొలిసారి అడుగుపెట్టారు కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా. తాజాగా రాజ్యాంగంపై జరిగిన చర్చ సందర్భంగా సభలో ఆమె తొలి ప్రసంగం చేశారు. దీనిపై ఆమె సోదరుడు, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. తన తొలి ప్రసంగం కంటే ప్రియాంక స్పీచ్ బాగుందంటూ ప్రశంసలు కురిపించారు. చాలా విషయాలపై ఆమె అద్భుతంగా మాట్లాడారని అన్నారు. ప్రతి విషయాన్ని సమగ్రంగా వివరించారని తెలిపారు.భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకొని 75వ ఏడాదిలోకి అడుగుపెట్టిన సందర్భంగా లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరుగుతోంది. ఇందులో విపక్షాల తరఫున కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా (ఖసతాజీనీజీ ఉజీనిటరతి) చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె అధికార భాజపా, ఆరెస్సెస్‌పై ఘాటు విమర్శలు గుప్పించారు. ఒక వ్యక్తి కోసం 142 కోట్ల మంది ప్రయోజనాలను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని మార్చాలని భాజపా ప్రయత్నించిందని, కానీ, లోక్‌సభ ఫలితాలతో (అధికార పార్టీకి భారీ మెజార్టీ రాకపోవడాన్ని ఉద్దేశిస్తూ) ఆ నిర్ణయంపై వెనక్కి తగ్గారని ఎద్దేవా చేశారు. రాజ్యాంగం అంటే సంఘ్ రూల్ బుక్ కాదని మండిపడ్డారు.



# ఏపీ దశ దిశను మార్చేలా స్వర్ణాంధ్ర - 2047 విజన్

## తెలుగు జాతిని ఉన్నత స్థానంలో నిలపడమే లక్ష్యం

## ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా ఎదుగుతోన్న భారత్

## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు




**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తూ.. విజన్ డాక్యుమెంట్ తీసుకురావడం తమ అకుంఠిత దీక్షకు నిదర్శనమని.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ మహాసంకల్పంలో భాగస్వాములైన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. చారిత్రక సమావేశానికి హాజరైన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా ఎదుగుతోందని అన్నారు. 2047లో మనం వందేళ్ల స్వాతంత్ర్య ఉత్సవాలు జరపుకుంటామని, ఆ నాటికి భారతదేశం అగ్రదేశంగా మారాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ - 2047ను కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని చంద్రబాబు వివరించారు. ఇందులో భాగంగా రాష్ట్రం కూడా ఒక స్పష్టమైన లక్ష్యంతో స్వర్ణాంధ్ర-2047ను విజన్ డాక్యుమెంట్ రూపొందించుకుందని వ్యాఖ్యానించారు. 'పది సూత్రాల వృద్ధి సోపానాలతో విలువైన విజన్ సాక్షాత్కరించింది. పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, ఇంటింటికీ నీటి భద్రత, రైతు-వ్యవసాయ సాంకేతికత, ప్రపంచస్థాయి పంపిణీ వ్యవస్థ (లాజిస్టిక్స్), శక్తి-ఇంధనాల వ్యయ నియంత్రణ, అన్ని రంగాల్లో పరిపూర్ణ ఉత్పాదన, సమగ్ర విధానాలతో స్వచ్ఛాంధ్ర, అన్ని దశల్లో సమగ్ర సాంకేతికత మార్గదర్శక సూత్రాల నవపథం ఆవిష్కృతమైంది' అని చంద్రబాబు వివరించారు.'నేను 1978 నుంచి అనేక ఎన్నికల్లో పోటీచేశాను. కానీ, 93 శాతం సక్సెస్ రేటు, 57 శాతం ఓటు బదిలీని 2024 ఎన్నికల్లో మాత్రమే చూశా. పవన్ కళ్యాణ్ వంటి మంచి మిత్రుడు ఉండటం చాలా సంతోషంగా ఉంది. పాలన చేపట్టాక చూస్తుంటే మా ఊహలకన్న ఎక్కువ విధ్వంసం జరిగిందని తెలిసింది. గాడితప్పిన పరిపాలనను చక్కదిద్దుకుంటూ ముందుకెళ్తున్నాం. ప్రస్తుతం మన రాష్ట్రంలో తలసరి ఆదాయం మూడువేల డాలర్ల కంటే తక్కువగా ఉంది. 2047 నాటికి తలసరి ఆదాయాన్ని 42 వేల డాలర్లుకు చేర్చాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'హైదరాబాద్‌లో హైటెక్‌సిటీ ప్రాంతానికి వెళ్లినప్పుడల్లా మేమందరం రాళ్లు మాత్రమే చూశాం. మీరు మాత్రం అందులో ఒక విజన్ చూశారని పవన్ కళ్యాణ్ ఎప్పుడూ అంటుంటార్న. ఆ రోజు అక్కడ ఒక సింగపూర్‌ను, దుబాయ్‌ను చూశా. న్యూయార్క్ వంటి నగరాన్ని ఎందుకు అభివృద్ధి చేయకూడదనే ఆలోచన చేసి, ముందుకెళ్లాను. ఆనాడు చేసిన విజన్, పునాది కారణంగా హైదరాబాద్ నగరం, తెలంగాణ రాష్ట్రం భారతదేశంలో ఎక్కువ తలసరి ఆదాయం సంపాదించే రాష్ట్రంగా తయారైందని చెప్పడానికి గర్వంగా ఉంది' అని చంద్రబాబు చెప్పారు.'మన దగ్గర మెరికల్లాంటి యువత ఉన్నారు. తిరుగులేని మానవవనరులు, సహజ వనరులు, నదులు, సముద్రతీరం ఉన్నాయి. వీటన్నింటినీ సక్రమంగా ఉపయోగించుకుంటే ఏదైనా సాధ్యమే. వెల్తీ, హెల్తీ, హ్యాపీ సొసైటీ ఉండాలనే లక్ష్యంతో పది సూత్రాలతో స్వర్ణాంధ్ర - 2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాం. సమాజమే దేవాలయం.. పేదలే దేవుళ్లు అని చెప్పిన వ్యక్తి ఎన్‌టీఆర్.. ఆ స్ఫూర్తితోనే నేడు జీరో పావర్టీ కోసం సంకల్పించాం' అని చంద్రబాబు స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో రాజకీయ సుస్థిరత కోరుకుంటున్నా

### స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ ఆవిష్కరణలో పవన్



**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** రాష్ట్రానికి తక్కువలో తక్కువగా దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు రాజకీయ సుస్థిరత ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమంలో పవన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కుల, మత, ప్రాంతాల పరంగా కొట్టుకునే రోజులు ఇక పోయాయన్నారు. రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేసే పరిస్థితులు ఇక ఉండవన్నారు. చంద్రబాబుకు భగవంతుడు నిండు నూరేళ్ల ఆయుషుతో పాటు మంచి ఆరోగ్యం ఇవ్వాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. 'చంద్రబాబు నా గౌరవ మర్యాదలు ఎక్కడా తగ్గకుండా చూస్తూ నన్ను నమ్మిన ప్రజలకూ గౌరవం ఇస్తున్నారు. అలాంటి చంద్రబాబు గౌరవం నేను ఏ రోజూ తగ్గించను' అని స్పష్టం చేశారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలో ఉన్న అన్ని స్థాయిల్లో నాయకులు చంద్రబాబుతో తానెలా కలిసి పనిచేస్తున్నానో అలాగే సమష్టిగా కలిసి పనిచేయాలని కోరారు. అప్పుడప్పుడు కొన్ని సమస్యలున్నా వాటిని అధిగమించి వెళ్లటమే ప్రజలు మనకిచ్చిన ఎన్నికల ఫలితాన్ని సాకారం చేయటం అని అన్నారు. వేదిక మీద ఉన్న వాళ్లమంతా ఒకే మాట మీద ఉన్నాం, చంద్రబాబు వెన్నంటే ఉన్నామని తెలిపారు. అంతా కలిసి ప్రధాని మోదీ కనే వికసిత్ భారత్ కలను సాకారం చేస్తామన్నారు. మోదీ ఆకాంక్ష నెరవేరాలంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చంద్రబాబు నాయకత్వంలో బలంగా ఉండాలని తెలిపారు. అద్భుతమైన 2047 విజన్ సాకార యాత్రలో చంద్రబాబు వెన్నంటే ఉంటా అని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

# వాహనాలపై భారీగా రాయితీలు

## పరిశ్రమలకు ప్రోత్సహకాలు.. ఏపీలో కొత్త ఈవీ పాలసీ విడుదల

## ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0 రూపకల్పన

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** ఏపీలో కొత్త ఎలక్ట్రిక్ వాహనాల పాలసీని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. గత కొంత కాలంగా ఈవీలకు పన్ను ప్రోత్సహకాల విషయంలో ప్రతిష్టంభన నెలకొనడంతో వాహనాల కొనుగోళ్లు తగ్గిపోయాయి. పొరుగు రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నా ఏపీలో కొంత జాప్యం జరిగింది. ఎట్టకేలకు ఏపీలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచేలా ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0ను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది. 2024-29 మధ్య పాలసీ నిబంధనలు అమలులో ఉంటాయని పేర్కొంది. విద్యుత్తు వాహనాల తయారీదారులతోపాటు కొనుగోలుదారులకూ రాయితీలు ప్రకటించింది. ఎలక్ట్రిక్ బ్యాటరీల సాయంతో నడిచే ద్విచక్రవాహనాలు, ఆటోలు, బస్సులు, రవాణా వాహనాలు, ట్రాక్టర్లకు ఇకపై ఏపీలో విక్రయ ధరలో 5 శాతం రాయితీ కల్పిస్తారు.ఆర్వీఎస్ఎస్ ఆపరేటర్ నుంచి సర్టిఫికెట్ ఆఫ్ డిపాజిట్ తీసుకుంటే వాహనం ధరలో 10 శాతం రాయితీ లభిస్తుంది. 2027 మార్చి వరకు జరిగే విక్రయాలపై మాత్రమే ఈ ప్రోత్సాహకం లభిస్తుంది. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న అన్ని విద్యుత్ వాహనాలకు ఐదేళ్లపాటు రోడ్డు ట్యాక్స్ మినహాయింపు ఇస్తారు. అయితే హైబ్రిడ్ వాహనాలకు ఈ మినహాయింపు వర్తించదు' అని పాలసీలో పేర్కొన్నారు.ఎక్స్ షోరూమ్ ధరకు కూడా పరిమితి విధించింది. ద్విచక్రవాహనానికి గరిష్ఠంగా రూ. లక్ష, త్రి చక్ర వాహనానికి రూ.2 లక్షలు, సరకు రవాణా వాహనానికి రూ.5 లక్షలు, ట్రాక్టర్కు రూ.6 లక్షలు, విద్యుత్ బస్సుకు రూ.2 కోట్ల వరకు పరిమితిగా తీసుకుని ప్రభుత్వ రాయితీ వర్తింపజేస్తారు. మొదటి 5 వేల ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే వారికి ఖర్చులో 25% (గరిష్ఠంగా రూ. 3లక్షల) వరకు రాయితీ ఇస్తారు. 2029 నాటికి 2 లక్షల విద్యుత్ ద్విచక్రవాహనాలు రిజిస్టర్ చేయడం, 2029 నాటికి కనీసం 10 వేల త్రిచక్ర వాహనాలు, 20 వేల కొత్త కార్లను తీసుకురావడంతో పాటు ఆర్టీసీలో నూరు శాతం విద్యుత్ బస్సుల వినియోగం లక్ష్యంగా పెట్టుకున్నారు. 30 కి.మీ.లకు ఒక విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్ అందుబాటులో తీసుకువస్తారు. ఈ-మొబిలిటీ నగరాల నిర్మాణానికి రూ.500 కోట్లతో కార్పస్ నిధి ఏర్పాటు చేస్తారు. ఈ-మొబిలిటీ స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు 100 ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తారు. ఈవీ రంగంతో అనుసంధానమైన భాగస్వామ్య పక్షాల నుంచి తీసుకున్న అభిప్రాయాలకు అనుగుణంగా పాలసీ విధానాలను ప్రభుత్వం రూపొందించినట్టు పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు, విడిభాగాల తయారీ యూనిట్లు, పబ్లిక్, ప్రైవేటు ఆపరేటర్ల ద్వారా చార్జింగ్/ స్వాపింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తారు. రాష్ట్రంలో కొనుగోలు చేసిన విద్యుత్ వాహనాలు, రిజిస్ట్రేషన్ చేయడం, రిజిస్టర్డ్ వెహికల్ స్క్రాప్ ఫెసిలిటీస్ (ఆర్వీఎస్ఎఫ్) ఆపరేటర్లు, ఈ- వేస్ట్ రీసైక్లింగ్ యూనిట్లు, ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్లు (ఏటీఎస్) ఏర్పాటు చేయడం చేస్తారు.

# అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిపై విపక్షాలు అభిశంసన తీర్మానం

## వీహెచ్‌పీ కార్యక్రమంలో వివాదస్పద వ్యాఖ్యల నేపథ్యం.

## రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు నోటీసులు అందజేత

**అలహాబాద్,(క్రైమ్ మిర్రర్):** అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌పై ప్రతిపక్ష పార్టీలు అభిశంసన తీర్మానాన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టాయి. ఇటీవల జరిగిన వీహెచ్?పీ కార్యక్రమంలో ఆయన వివాదస్పద వ్యాఖ్యలు చేశారని రాజ్యసభ సెక్రటరీ జనరల్?కు నోటీసును అందించాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్?పై అభిశంసన తీర్మానాన్ని ప్రతిపాదించడానికి సంబంధించిన నోటీసుపై కపిల్ సిబల్, దిగ్విజయ్ సింగ్, జాన్ బ్రిట్టాస్, మనోజ్ కుమార్ ఝా, చిదంబరం, రణ్ దీప్ సుర్జేవాలా, ప్రమోద్ తివారీ, జైరాం రమేశ్, ముకుల్ వాస్నిక్, నాసీర్ హుస్సేన్, రాఘవ్ చద్దా, సంజయ్ సింగ్, రేణుకా చౌదరి సహా 55 మంది ప్రతిపక్ష ఎంపీలు సంతకం చేశారు. వీరందరూ కలిసి రాజ్యసభ సెక్రటరీ జనరల్ ను సభా కార్యక్రమాలు ప్రారంభానికి ముందు కలిశారు. ఈ క్రమంలో అభిశంసన నోటీసును అందజేశారు. న్యాయమూర్తుల (విచారణ) చట్టం 1968, రాజ్యాంగంలోని ఆర్టికల్ 218 కింద ఈ తీర్మానానికి సంబంధించిన నోటీసును సమర్పించారు. విశ్వ హిందూ పరిషత్ నిర్వహించిన కార్యక్రమంలో జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని నోటీసులో విపక్ష సభ్యులు ఆరోపించారు. ద్వేషపూరిత ప్రసంగం, మత సామరస్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. న్యాయమూర్తి మైనారిటీలను లక్ష్యంగా చేసుకున్నారని, వారిపై పక్షపాతం చూపించారని తెలిపారు. "జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించిన విషయాలపై రాజకీయంగా మాట్లాడారు. బహిరంగంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఇలా చేయడం న్యాయవ్యవస్థను ఉల్లంఘించినట్లే. జస్టిస్ శేఖర్ కుమార్ చేసిన బహిరంగ వ్యాఖ్యలు రెచ్చగొట్టేవిగా ఉన్నాయి. అలాగే పక్షపాతంతో కూడుకున్నవి" అని నోటీసులో పేర్కొన్నారు. "దేశంలోని మెజారిటీ ప్రజల ఇష్టానికి అనుగుణంగా భారత్ పనిచేస్తుందని జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ అన్నారు. ఆయన భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ(ఈ) కింద పొందుపరచిన ఆదేశిక సూత్రాలను ఉల్లంఘించారు. ఆయన వ్యాఖ్యలు వివిధ మతాలు, మత సమూహాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహిస్తున్నాయి.

# 3 రోజుల్లో మరో 'అల్పపీడనం'

## ఏపీకి మరోసారి వర్ష సూచన..!

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** గల్ఫ్ ఆఫ్ మన్నార్ దానికి అనుకుని ఉన్న కొమోరిన్ ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం... ప్రస్తుతం లక్షద్వీప్, మాల్దీవుల మీదుగా ఉందని ఐఎండీ తెలిపింది. సంబంధిత ఎగువ వాయు ఉపరితల ఆవర్తనం.. సగటు సముద్ర మట్టానికి 5.8 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉందని పేర్కొంది. ఇది రాగల 24 గంటల్లో పశ్చిమ దిశగా కదిలి బలహీనపడే అవకాశం ఉందని వివరించింది. డిసెంబర్ 14వ తేదీ నాటికి దక్షిణ అండమాన్ సముద్రంపై ఎగువ వాయు ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. తదుపరి 48 గంటల్లో అది అల్పపీడనంగా మారుతుందని పేర్కొంది. ఆ తర్వాత పశ్చిమ - వాయువ్య దిశగా తమిళనాడు తీరాల వైపు కదులుతుందని తాజా బులెటిన్ లో పేర్కొంది. తాజా వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో... ఏపీలోని ఉత్తర కోస్తాలో ఇవాళ, రేపు పొడి వాతావరణం ఉంటుందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. ఇక దక్షిణ కోస్తాలో ఇవాళ, రేపు తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని తెలిపింది.

# మార్చి 31న సాంఘిక శాస్త్రం పరీక్ష నిర్వహణ

## ఏపీ పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పు!

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ బడుల్లో 2024-25 విద్యా సంవత్సరానికి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సంబంధించి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. ఈ షెడ్యూల్ ప్రకారం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభమై 31వ తేదీతో ముగియనున్నాయి. అయితే ఈ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నట్లు తాజాగా విద్యాశాఖ వెల్లడించింది. మార్చి 31న సాంఘిక శాస్త్రం పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం తొలుత ప్రకటించగా.. సరిగ్గా అదే రోజున రంజాన్ పండగ వచ్చింది. రంజాన్ సెలవు దినంగా ప్రభుత్వ కేలండర్‌లోనూ ఉంది.నెలవంక మార్చి 31వ తేదీన కనిపిస్తే అదే రోజు రంజాన్ ఉంటుంది. ఒకవేళ ఆ రోజున పండగ వస్తే ఏప్రిల్ 1న సాంఘిక శాస్త్రం పరీక్ష నిర్వహిస్తామని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. దీంతో నెల వంక ఎప్పుడు కనిపిస్తుందో దానిని బట్టి సాంఘిక శాస్త్రం పరీక్ష నిర్వహించే అవకాశం ఉంది. కాగా మొత్తం 7 పేపర్లకు ఈ పరీక్షలు జరుగుతాయని ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. సామాన్యశాస్త్రంలో భౌతిక, రసాయన శాస్త్రాలు కలిపి ఒక పేపర్‌గా, జీవశాస్త్రం మరో పేపర్‌గా ఇవ్వనున్నారు. ఒక్కో పేపర్ 50 మార్కుల చొప్పున ఉంటాయి. ఈ మేరకు పరీక్షల షెడ్యూల్‌ను మంత్రి నారా లోకేశ్ డిసెంబరు 11న విడుదల చేశారు. ఇక విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు రోజు విడిచి రోజు పరీక్షలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ వెల్లడించింది. ఈ అదనపు సమయం సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొంది. ఆయా తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయి. సైన్స్ పేపర్లకైతే ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.

# అనంతపురం జిల్లాలో విషాదం

## భర్త వేధింపులకు భార్య, కుమారుడు మృతి

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** అనంతపురం జిల్లా గార్లదిన్నెలో గురువారం తీవ్ర విషాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గార్లదిన్నె మండలంలోని యర్రగుంట్లకు చెందిన సురేష్‌కు.. శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం నల్లచెరువు గ్రామానికి చెందిన సుజాత (35)కు దాదాపు 20 ఏళ్ల కిందట వివాహం అయింది. సురేష్, సుజాత దంపతులకు కుమార్తె సాహిత్య, కుమారుడు నాగ చైతన్య (9) ఉన్నారు. కుమార్తె సాహిత్య ప్రస్తుతం చెన్నై ఒక ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. నాగ చైతన్య గార్లదిన్నెలోనే ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నాడు. సురేష్, సుజాత కుటుంబం మూడేళ్ల కిందట యర్రగుంట్ల నుంచి గార్లదిన్నె వచ్చారు. అక్కడే అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. సుజాత కిరాణా షాపు, చీరల వ్యాపారం నిర్వహిస్తోంది. అయితే ఇటీవల భార్య భర్తల మధ్య గొడవులు జరుగుతుండేవి. సుజాతను భర్త సురేష్ సూటిపోటి మాటలతో వేధించేవాడు. దీంతో జీవితంపై సుజాత విరక్తి చెందింది. బంధువుల వివాహం కోసం సాహిత్య చెన్నై నుంచి నాలుగు రోజుల కిందటే యర్రగుంట్ల గ్రామానికి వచ్చింది. బుధవారం కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పెళ్లిని చూసుకోని, అదే రోజు రాత్రి తల్లిదండ్రులతో పాటు సాహిత్య కూడా గార్లదిన్నెకు వచ్చింది. గురువారం కుటుంబంతో ఉండి శుక్రవారం సాహిత్య కాలేజీ (చెన్నై)కి వెళ్లాల్సి ఉంది. అయితే పెళ్లిలో సుజాతను భర్త సురేష్ సూటిపోటి మాటలతో వేధించాడు. దీంతో గురువారం ఉదయం ఇంట్లో గొడవ జరిగింది. ఈ క్రమంలో సుజాత తీవ్ర మనస్థాపనకు గురై విషపగుళికలు కలిపిన నీళ్లను ఇద్దరు పిల్లలకు తాగించి, తాను కూడా తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ఆ సమయంలో సాహిత్య, నాగచైతన్యకు అనుమానం వచ్చింది. దీంతో తల్లి సుజాతను ఏంటమ్మా ఇది అని అడిగారు. నూలిపురుగుల నివారణ మందు అని చెప్పి పిల్లలకు తాగించింది.తొలిత అమ్మ అపస్మారక స్థితిలో పడిపోయింది. దీంతో కుమార్తె సాహిత్య బయటకు వెళ్లి కేకలు వేసింది. దీంతో వెంటనే స్థానికులు అక్కడికి చేరుకున్నారు. ముగ్గురిని అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శనివారం 14-12-2024


# ప్రేమావతిపేట ప్రజలు ఉపయోగించే రోడ్డును యూనివర్సిటీ అధికారులు మూసి వేయడంతో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలిసిన మహిళలు





**గండిపేట్(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ యూనివర్సిటీ అధికారులు ప్రజలు వినియోగించే రోడ్డును అక్రమంగా అడ్డగోడ నిర్మించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ప్రేమావతిపేట వాసులు వాపోయారు. ఈ మేరకు జై భీమ్ జై రామ్ సంఘం అధ్యక్షుడు గోల్కొండ రాజుకుమార్, ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యంల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలతో కలిసి రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను కలిసి విన్నవించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య, యూనివర్సిటీ అధికారులు కావాలనే ప్రేమావతి పేట గ్రామం నుంచి యూనివర్సిటీకి వెళ్లే రోడ్డుకు అడ్డంగా గోడ కట్టారన్నారు. ఎన్నో ఎండ్ల నుంచి తమకు రాకపోకల కోసం ఉన్న రోడ్డును ప్రస్తుతం నూతనంగా వచ్చిన వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య ప్రజలకు ఇబ్బందులు కలిగేలా రోడ్డుకు అడ్డంగా గోడ కట్టడం కోసం తీసుకున్న నిర్ణయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళల బాధలు విన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ స్పందించి విసి జానయ్యను త్వరలో గ్రామస్తులను కూర్చోబెట్టి మాట్లాడి రోడ్డును తెరిపిస్తనని మాట ఇచ్చారు. అందుకు మహిళలు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలిసిన వారిలో డివిజన్ అధ్యక్షుడు నత్తి ధనుంజయ్, ఉపాధ్యక్షుడు మజ్జిగ నర్సింహ్మాయాదవ్, టి.రవిముదిరాజ్, మహిళా ఉపాధ్యక్షురాలు గోల్కొండ సునంద, బీఆర్ఎస్ నాయకులు ఎడ్లకాడి సరస్వతి, మీసాల పెంటమ్మ, నడికూడ ఇందిర, కోరని శోభ, బండారి శివరాణి, సులోచన, ఆగపల్లి హేమలత, ఎరుకలి గాయత్రి, ఎరుకలి లావణ్య, ఎడ్లకాడి లలిత, మంకాల మహేశ్వరి, గోల్కొండ మంజుల, గోల్కొండ సుమిత్ర, కోరని లావణ్య, కవ్వగూడెం అనసూజ, అమృత, కాసారం లక్ష్మమ్మ, మంగళ్లారం దేవమ్మ, సి.సక్కుభాయ్, దానం అండాలు, డి.వసంత, ఎం.బాలమణి, ఎం.లత, ఆగపల్లి బాలమణి, లేవిరాజ్, ఉపేందర్, చంద్రశేఖర్, సుమన్, జనార్ధన్, జగన్, నర్సింహ్మా, ఉదయ్, ఖాసీం, నాని, సన్నీ, నవీన్, ప్రవీణ్, సత్తయ్య, వెంకీ తదిదితరులు పాల్గొన్నారు.



# పోడు భూములను అటవి శాఖకు కెటహించటాన్ని నిలుపుదల చేయాలి

### తుడుం దెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ కుడిమెత తిరుపతి

**మంచిర్యాల ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** జిల్లా లోని ఏజెన్సీ మండలములైన కాసిపేట, దండేపల్లి, జన్నారం మరియు నాన్ ఏజెన్సీ మండలాలైన చెన్నూరు ,కోటపల్లి,వేమనపల్లి మండలాల్లో ని గ్రామ పంచాయతీ ల పరిధిలో సాగుచేస్తున్న పోడు భూములకు ఎలాంటి అనుమతులు లేకుండా పెస చట్టం ప్రకారం గ్రామ సభలు నిర్వహించకుండా అటవీ శాఖ కు వేల ఎకరాల్లో భూములు కేటాయిస్తూన్నారని, దీని వలన కేవలం పోడు వ్యవసాయం పైనే ఆధారపడిన ఆదివాసీ గిరిజన రైతు కుటుంబాలు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొని రోడ్డు పాలు అవుతున్నాయని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర కో-కన్వీనర్ కుడిమెత. తిరుపతి మంచిర్యాల జిల్లా ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వం పై మండిపడ్డారు. ఈ భూ కేటాయింపులను వెంటనే ఆపి ఆదివాసీ గిరిజన రైతుల కుటుంబాలకు న్యాయం చేసి ఆదుకోవాలని కోరారు. అలాగే అటవీశాఖ మరియు రెవెన్యూ శాఖ అధికారులు వీరి భూములకు రక్షణ కల్పించాలని కోరారు. అదేవిదంగా దండేపల్లి మండలం లోని ముత్యంపేట గ్రామంలో లోని సర్వే నెంబర్ 17 గల ప్రభుత్వ భూమిని ఆదివాసీ గిరిజన కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. సర్వే నెంబర్ 18లో అక్రమంగా నిర్మించుకున్న ముద్దసాని వేణు రైస్ మిల్లుని వెంటనే సీజ్ చేయాలని, కాసిపేట మండలంలోని తిరుమలపూర్ గ్రామంలోని ఆదివాసుల భూములను లాక్కోడం సరికాదని ఇలాంటి చర్యలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని హెచ్చరించారు. లేనియెడల భారీ సంఖ్యలో ఆదివాసీ 9 గిరిజన సంఘాల నాయకులతో పాటుగా గిరిజన కుటుంబాల తో కలిసి జిల్లా కలెక్టరేట్ ముట్టడి చేస్తూ మహా ధర్నా, రాస్తారోకో కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర కో-కన్వీనర్ కుడిమెత. తిరుపతి, తోటి సేవా సంఘం రాష్ట్ర నాయకులు మర్సకొల. బాపురావ్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు జేక. శేఖర్, ప్రధాన కార్యదర్శి కనక





రాజు,తోటి సేవ సంఘం మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్సింగ. వెంకటేష్ ,కోయ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఆలం. బాపు,తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్రం. వెంకట రాజం, దండేపల్లి మండల ప్రధాన కార్యదర్శి తట్ర.అర్జున్, కాసిపేట మండల అధ్యక్షుడు సంద్ర. భూమయ్య, ప్రధాన కార్యదర్శి కుర్సింగ తిరుపతి తో పాటుగా పలువురు పాల్గొన్నారు

# పెండింగ్లో ఉన్న మన ఊరు మనబడి నిధులను విడుదల చేయాలి

### డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలంగాణ ఐఏఎస్ అధికారికి వినతి పత్రం ఇచ్చిన కాంట్రాక్టర్లు

### కొడంగల్ నియోజకవర్గానికి నిధులు విడుదల చేసి పరిగి నియోజకవర్గానికి మొండి చెయ్యి చూపిన సీఎం

### పిఎన్ పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు రాఘవేందర్ గౌడ్



**క్రైన్ మిర్రర్ కుల్కచర్ల:** మన ఊరు మనబడి పెండింగ్ లో ఉన్న నిధులు వెంటనే విడుదల చేయాలని పరిగి నియోజకవర్గ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రాఘవేందర్ గౌడ్ సూచించారు. హైదరాబాదులోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలంగాణ ఐఏఎస్ అధికారికి నరసింహ రెడ్డికి శుక్రవారం ఎస్ఎంసి చైర్మన్లు కాంట్రాక్టర్లతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కొడంగల్లో పనిచేసిన వ్యక్తులకు మన ఊరు మనబడి నిధులు విడుదల చేసి పరిగి నియోజక వర్గంలో పనిచేసిన వ్యక్తులకు బిల్లులు పెండింగ్లో పెట్టడం చాలా బాధాకరం అని ఈ వివక్ష తగదని పిఎన్ పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఘనపూర్ రాఘవేందర్ గౌడ్ హెచ్చరించారు. మన ఊరు మనబడి పనులు చేసి సంవత్సరాలు గడుస్తున్న బిల్లులు మాత్రం చెల్లించడం లేదని ముఖ్యమంత్రి నియోజకవర్గానికి నిధులు చేసి,పక్కనున్న పరిగి నియోజకవర్గానికి బిల్లులు ఇవ్వకుండా ఆపడం ఎంతవరకు సమంజసం అని వారు అన్నారు. ఇక్కడ పనులు చేసిన వ్యక్తులు అప్పులు చేసి బంగారం తాకట్టు పెట్టి పనులు చేస్తే వీళ్లకు బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం చాలా బాధాకరం అని, వెంటనే నిధులు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ రవిచంద్ర, బొమ్మరిడిపల్లి నాయకులు చంద్రయ్య,ముజహిద్పూర్ గ్రామానికి చెందిన అరవింద్ దోమ మండలానికి చెందిన మల్లేపల్లి వెంకటయ్య,బొంపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్, పుడూరు గ్రామానికి చెందిన జంగయ్య,హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిది

### యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చింతకాయల జంగయ్య ముదిరాజ్

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఒక వరం లాంటిదని యూత్ కాంగ్రెస్ కుల్కచర్ల మండల అధ్యక్షులు చింతకాయల జంగయ్య ముదిరాజ్ సూచించారు. కుల్కచర్ల మండలంలోని రామ్ నగర్ గ్రామానికి చెందిన పోలెమోని లక్ష్మి హనుమయ్య అనే లబ్ధిదారు రాలుకు శుక్రవారం వారు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామ్ నగర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సాయికుమార్, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య,రాంనగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు శీను తదితరులు పాల్గొన్నారు.








# ఇందిరమ్మ ఇండ్ల సర్వేను సక్రమంగా నిర్వహించాలి

### బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మద్దెల లతాప్రేమ్‌గౌడ్

**గండిపేట్(క్రైం మిర్రర్):** ప్రభుత్వ నియమనిబంధనాల ప్రకారం సరేవ నిర్వహించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మద్దెల లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఇందిరమ్మ ఇండ్లు సర్వేలో భాగంగా శిక్షణ కార్యక్రమాన్ని మేయర్ అధ్యక్షతన ఎస్ఎంపీ మోడల్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమీషనర్ శరత్‌చంద్రతో కలిసి మేయర్ లతాప్రేమ్‌గౌడ్ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రజా పాలనలో భాగంగా ధరఖాస్తు చేసుకున్న వాటిలో ఇందిరమ్మ ఇండ్లు ఎంపిక చేయాల్సి ఉందని తెలిపారు. క్షణలో పాల్గొనే ఉద్యోగులు లాగిన్‌తోనే పని చేయాలని ఎలాంటి తప్పులు లేకుండా సక్రమంగా నిర్వహించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి పేదలకు వరంగా మారింది

### రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్



**గండిపేట్(క్రైం మిర్రర్):** సీఎం సహాయ నిధి పేదలకు వరంగా మారిందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ ఇందిరమ్మ కాలనీకి చెందిన సభావత్ గోవింద్‌కు 60 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలకు ధరఖాస్తు చేసుకునే వారికి లబ్ధి చేకూరేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోకరి సురేష్‌గౌడ్, హీరాలాల్‌నాయక్, గోపాల్‌స్వామి, గోపాల్‌నాయక్ దదితరులు పాల్గన్నారు.

# సినీనటుడు మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు నిరసన ర్యాలీ

### ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేసిన జర్నలిస్టులు



**గండిపేట్(క్రైం మిర్రర్):** జల్‌పల్లి ఫామ్‌హౌస్ వద్ద సినీనటుడు మోహన్‌బాబు టీవీ9 జర్నలిస్టు రంజిత్‌పై చేసిన దాడి హేయమైన చర్య అని రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా శుక్రవారం ఉదయం హైదర్‌గూడ చౌరస్తా పిల్లర్ నెంబర్ 143 నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయంలో జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. మోహన్‌బాబును వెంటనే అరెస్టు చేయాలని, గాయపడ్డ జర్నలిస్టుకు ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, జర్నలిస్టులపై దాడులు జరగకుండా ప్రభుత్వం కఠిన చట్టాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ లపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

## మోహన్ బాబు పై హత్యాయత్నం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలి

## తీగల శ్రీనివాస్ రావు స్టేట్ వైస్ ప్రెసిడెంట్ జర్నలిస్ట్ యూనియన్ ఏ డి జె ఎఫ్

**మంచిర్యాల ప్రతినిధి (క్రైమ్ మిర్రర్ ):** హైదరాబాద్ లోని జిల్ పల్లిలో విధినిర్వహణ లో భాగంగా వార్త సేకరణకు వెళ్లిన జర్నలిస్ట్ లపై దుర్భాశలాడుతూ, విశాక్షణ రహితంగా భౌతిక దాడి చేసి టివి9 ప్రతినిధి సీనియర్ జర్నలిస్ట్ రంజిత్ పై జైగోమాటిక్ బోన్ ఫ్రాక్చర్ అయ్యే విదంగా లోగో తో దాడి చేసిన మంచు మోహన్ బాబుపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ఆల్ డెమోక్రాటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తీగల శ్రీనివాస్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజా సమస్యలను ఎప్పటి కప్పుడు ప్రభుత్వాన్ని చేరవేస్తూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్ట్ లపై దాడులు అధికమౌతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.జర్నలిస్ట్ లపైన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.ప్రభుత్వం జర్నలిస్ట్ లపై దాడులు జరుగకుండా కఠిన చట్టాలను అమలు చేయాలని కోరారు.సమాజానికి నిజాయితీతో సమాచారాన్ని అందించేందుకు కృషి చేసే జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరు ఖండించవలసిన అవసరం ఉందని అల్ డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర



ఉపాధ్యక్షులు తీగల శ్రీనివాస్ రావు అన్నారు. ఇటీవలి కాలంలో ప్రముఖ నటుడు మోహన్ బాబు జర్నలిస్టులపై దాడి చేయడం అత్యంత దౌర్జన్యమైన చర్యగా మేము భావిస్తున్నాం అని అన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా నాల్గవ స్థంభంగా ఉంది. జర్నలిస్టులు తమ విధులను నిర్వహించే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను, ముప్పులను తట్టుకుని, ప్రజలకు వాస్తవాలను వెల్లడించడానికి ప్రయత్నిస్తారు. ఇటువంటి సందర్భంలో వారిపై దాడులు జరగడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు అని అన్నారు.మోహన్ బాబు వంటి ప్రముఖులు తమ స్థాయిని ఉపయోగించి సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలవాలి గాని, ఇలాంటి దాడుల ద్వారా ద్వేషాన్ని ప్రేరేపించటం సరికాదన్నారు. ఈ ఘటనపై తక్షణమే విచారణ జరిపి మోహన్ బాబు తో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి శ్రీనివాస్ రావు ప్రభుత్వాన్ని కోరారు.ఏ జర్నలిస్ట్ కి కష్టం వచ్చినా ఏ డి జె ఎఫ్ అండగా నిలుస్తుందన్నారు ఇలాంటి దాడుల పునరావృతాన్ని నివారించేందుకు, జర్నలిస్టుల రక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని తీగల శ్రీనివాస్ రావు కోరారు.



## ఆత్మహత్య చేసుకోబోయిన వ్యక్తి ప్రాణాలు కాపాడిన రాజేంద్రనగర్ ట్రాఫిక్ హెూంగార్డు చంద్రమౌళి

**గండిపేట్(క్రైం మిర్రర్):** శివరాంపల్లి పి.వి.నర్సింహ్మారావు ఎక్స్ప్రెస్‌వేపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకోబోయిన ఓ వ్యక్తిని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు కాపాడారు. శుక్రవారం ఉదయం బ్రిడ్జీపై ట్రాఫిక్ హెూంగార్డు చంద్రమౌళి డ్యూటీ చేస్తున్నాడు. ఈ సమయంలోనే ఓ వ్యక్తి బ్రిడ్జీపైకి నడుచుకుంటూ వచ్చాడు. అనంతరం బ్రిడ్జీ పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేశాడు. వెంటనే స్పందించిన ట్రాఫిక్ హెూంగార్డు అతడిని నివారించి ఆత్మహత్య చేసుకోవద్దని సముదాయించాడు. అనంతరం అతడిని అక్కడ నుంచి పక్కకు తీసుకుగ్పి ల్లి వివరాలను సేకరించారు. రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకోని ఆత్మహత్యకు పాల్పడుతున్న వ్యక్తిని అక్కడ నుంచి తీసుకువెళ్లి స్టేషన్‌కు తరలించారు. అనంతరం కౌన్సిలింగ్ నిర్వహించి పంపించారు.

## జియోట్యాగింగ్‌పై జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

**గండిపేట్(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉపపకమీషనర్ రవికుమార్ నిర్వహించిన జీహెచ్ఎంసీ, హెచ్ఎండిఏ పరిధిలోని జియోట్యాగింగ్ పై నిర్వహించిన సమావేశంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ తోకల శ్రీనివాస్‌రెడ్డి స్థానిక కార్పొరేటర్‌లతో కలిసి జియో టాకింగ్‌విధానంపై తగిన సూచనలను, సలహాలు అందజేశారు. రానున్న రోజుల్లో జీహెచ్ఎంసీ చేపట్టబోయే జియోట్యాగింగ్ పై చర్చించారు. తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌ల పరిధిలో అధికారులు సరైన అవగాహనతో స్థలాలు, వాగులు, కమ్యూనిటి బిల్డింగులు అద్దె భవనాలు ఇలా చాలా వరకు బల్దియా పరిధిలోకి వస్తాయని ఈ ప్రక్రియలో ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా కొనసాగించాలని తెలిపారు. అదే విధంగా జియో ట్యాగింగ్ చేసిన జిటల్ నంబరింగ్ విధానంపై స్థానిక కార్పొరేటర్లు సూచనలు తీసుకోవడం జరిగింది.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం




**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని చెల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం జరిగింది. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యార్థిని విద్యార్థులకు పాఠాలు బోధించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుప్పలి ఆనంద్ కుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, దస్తయ్య,శ్రీనివాస్ స్కావెంజర్ బాలయ్య విద్యార్థి విద్యార్థినులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## కోకాపేట్‌లోని దొడ్డి కొమురయ్య కురుమ ఆత్మగౌరవ భవనాన్ని సందర్శించిన ప్రజాప్రతినిధులు, అధికారులు.

**గండిపేట్(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం కోకాపేట్‌లో నిర్మాణం పూర్తైన తెలంగాణ రాష్ట్ర కురుమ విద్యార్థి హాస్టల్ ట్రస్ట్ దొడ్డి కొమురయ్య కురుమ ఆత్మీయ గౌరవ భవనాన్ని శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సందర్శించారు. భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యంలో హాస్టల్ భవనాన్ని సభ ప్రాంగణాన్ని ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, అధికారులు సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, రాజేంద్రనగర్ డీసీపీ, ప్రజాప్రతినిధులు సందర్శించి పరిశీలించారు.








## నార్సింగిలోని అంగన్‌వాడీ కేంద్రంలో వెల్ బేబీ షో విజయవంతం

### హజరైన కౌన్సిలర్ ఉషారాణి

గండిపేట్(క్రైం మిర్రర్): యునైటెడ్ వే హైదరాబాద్ సంస్థ గండిపేట మండలంలో ఐదు అంగన్‌వాడీ కేంద్రాలను దత్తత తీసుకుంది. నార్సింగిలోని 17వ వార్డుకు సంబంధించిన ఫోర్త్ అంగన్‌వాడీ సెంటర్‌ని దత్తత తీసుకోవడం జరిగింది. వీటి అభివృద్ధి కోసం పెయింటింగ్, ఆర్ట్‌వర్క్, పోషకాహార సమావేశాలు, గర్భధారణ మందరం, తరువాత సంరక్షణ(ఏఎన్‌సీ అండ్ పీఎన్‌సీ) సమావేశాలు, ఈసీసీఈ శిక్షణ, కమ్యూనిటీ ఈవెంట్స్, డాక్టర్ స్క్రీనింగ్‌లపై ప్రత్యేక దృష్టిసారించింది. నార్సింగిలోని 17వ వార్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో వెల్ బేబీ షో విజయవంతంగా నినర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ నుంచి మహేశ్వరి, అస్మా నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ ఉషారాణి ఈ సంస్థ సేవలను ప్రశంసిస్తూ అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి, సమాజానికి అందిస్తున్న మద్దతు పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ప్రాముఖ్యతను ఆమె హైలెట్ చేస్తూ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. అదనంగా పోషకాహారంపై ప్రత్యేక సమావేశాన్ని న్యూట్రిషనిస్ట్ ఎదేవి, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ నుంచి నిర్వహించారు. ఈ సమావేశంలో తల్లులు, పిల్లల కోసం సమతుల ఆహారం, పోషక అవసరాల గురించి అవగాహన పెంచడం, ఆరోగ్యకరమైన జీవనానికి అవసరమైన జ్ఞానాన్ని అందించడంపై దృష్టిసారించింది. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్స్ రాణి, అన్నపూర్ణ, ఆయాలు లత, లలిత, మహిళలు, చిన్నారులు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.


## మామ పై చెప్పుతో దాడి చేసిన కోడలిపై కేసు నమోదు.. రిమాండ్ కు తరలింపు

### మండల ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు





**క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, వేములపల్లి:** ఆస్తికోసం మామ పై చెప్పుతో విచక్షణ రహితంగా దాడి చేసిన కోడలు గగినపల్లి మణిమాల పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు మండల ఎస్ఐ డి. వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం నల్గొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత నెల 20వ తారీకు మండలం పరిధిలోని శెట్టిపాలెం గ్రామానికి చెందిన గగినపల్లి బుచ్చిరెడ్డి పై తన పెద్ద కుమారుడు శ్రీనివాస్ రెడ్డి భార్య గగినపల్లి మణిమాల తమకు ఆస్తిలో వాటా తక్కువగా ఇచ్చారనే నేపంతో నడవలేని స్థితిలో వీల్ చైర్ లో ఇంటి వరండాలో కూర్చున్న బుచ్చిరెడ్డి పై చెప్పుతో విచక్షణ రహితంగా దాడి చేసిన సీసీ కెమెరా దృశ్యాలు ఈనెల 8వ తారీఖున సోషల్ మీడియాలో వైరల్ అయినా విషయం అందరికీ తెలిసిందే. దానిపై విచారణ చేపట్టి గగినపల్లి మణిమాలపై కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్ కి తరలించినట్లు మండల ఎస్ఐ డి. వెంకటేశ్వర్లు తెలిపారు..





# వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ

### పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

**గండిపేట్(క్రైం మిర్రర్):** స్వామి శరణం... అయ్యప్ప శరణం... స్వామియే శరణం అయ్యప్ప... అయ్యప్పో... స్వామియో అంటే భక్తుల నినాదాలు స్వామి వారి భక్తి గీతాలతో భక్తిభావంతో నిండిపోయింది. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని దుర్గా కన్వెన్షన్‌హాల్‌లో తోలుకంటి దేవాదాస్‌గౌడ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హజరైయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు, స్వాములు అధిక సంఖ్యలో తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రేమ్ దాస్ గౌడ్, దేవదాస్ గౌడ్, ధర్మేందర్ గౌడ్, రవీంద్ర చారి, అనిల్ ముదిరాజ్, కళ్లెం లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# బీజేపీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలి

## జిల్లా సంస్థగత ఎన్నికల అధికారి అశోక్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి

**గండిపేట్(క్రైం మిర్రర్):** భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని జిల్లా సంస్థగత ఎన్నికల అధికారి అశోక్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డిలు అన్నారు. రాజేంద్రనగర్ అసెంబ్లీ సమావేశాన్ని మల్లేష్‌యాదవ్ అధ్యక్షతన ఉప్పర్‌పల్లిలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హజరైన వారు పార్టీ సభ్యత్వ కార్యక్రమం ఆక్టివ్ మెంబర్‌షిప్, సంస్థగత ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. డిసెంబర్ 17వ తేదీ నుంచి బూత్ కమిటిలను ఏర్పాటు చేసి తద్వార మండల కమిటిలను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, ఎం.కొమురయ్య, బొక్క బాల్‌రెడ్డి, జయానంద్‌రెడ్డి, ఎస్.వెంకటేష్, ఎస్.విజయ్‌కుమార్, అడికే జనార్ధన్, విక్రమ్‌చారి, రావుల జగన్, బండారి బాలకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# హైదర్షాకోట్‌లో చైన్ స్నాచర్ కలకలం

**గండిపేట్(క్రైం మిర్రర్):** నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో సన్‌సిటీలో మిట్ట మధ్యాహ్నం చైన్ స్నాచింగ్ జరిగింది. విజయ అపార్ట్‌మెంట్ మొదటి అంతస్తులో మల్లికార్జున్ అతడి భార్య మంజుల పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఓ దొంగ అపార్ట్‌మెంట్ పక్క బిల్డింగ్‌లో నుంచి విజయ అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించాడు. మొదటి అంతస్తులో ఉంటున్న మల్లికార్జున్ ఇంటి కాలింగ బెల్ కోట్టి ఇళ్లు తెరువగానే మహిళల మెడలోని నాలుగు తులాల పుస్తెల తాడును లాక్కెళ్లిపోయారు. దుండగుడు ముఖానికి మాస్క్ ధరించి ఉన్నాడని బాధితురాలు తెలిపింది. ఇంట్లో తలుపులు వేసుకోని ఉన్న మహిళలకు కూడా రక్షణ కరువుతుంది. మహిళలతో మాట్లాడి వివరాలను నార్సింగి పోలీసులు సేకరించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని చైన్ స్నాచర్‌ను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి నిఘాను పెంచుతున్నట్లు సూచించారు.







# నేడు మణికొండ మున్సిపాలిటీలలో బీఆర్ఎస్‌లో పలువురి చేరికలు

**గండిపేట్(క్రైం మిర్రర్):** భారత రాష్ట్ర సమితికి రోజు రోజుకు ప్రజల ఆదరణ పెరుగుతుందని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు బొడ్డు శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి నాయకులు, కార్యకర్తలు చేరనున్నారన్నారు. ఈ సందర్భంగా సాయంత్రం 6 గంటలకు శ్రీ కృష్ణా ప్లాజా బ్యాంక్వెట్ హాల్ దిలీప్ సూపర్ మార్కెట్ పైన సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి హజరుకానున్నారన్నారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కుంబగళ్ల ధనరాజ్, మహిళా అ్యధ్యక్షురాలు రూపారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గోద్మెగం గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం





**పిట్లం క్రైమ్ మిర్రర్:** కామారెడ్డి జిల్లా పిట్లం మండలం గోద్మేగం గ్రామంలో ఉచిత గర్భకోష వ్యాధుల చికిత్స శిబిరన్ని నిర్వహించారు.ఈ శిబిరంలో పశు ఘన అభివృద్ధి సంస్థ వారు ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ఈ శిబిరంలో 39 గర్భకోశ వ్యాధులు 10 కృత్రిమ గర్భాధారణ సాధారణ చికిత్స 7 నట్టల నివారిణి 33 మొత్తం 89 పశువులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ఈ శిబిరంలో రైతులకు చలికాలములో పశువులు ఎదకు వస్తాయి కాబట్టి మీరు సకాలంలో గుర్తించి అందుబాటులో ఉన్న గోపాలమిత్ర ద్వారా కృత్రిమ గర్భాధారణ చేయించినట్లయితే మంచి మేలు దూడలు పుడతాయి అని,అధిక పాలను ఇస్తాయని ఇటువంటి ఉచిత గర్వకోశ వ్యాధుల చికిత్స శిబిరము సద్వినియోగము చేసుకోవాలని పిట్లం మండల పశువైద్యాధికారి డాక్టర్ పి.సంతోష్ గ్రామ పాడి రైతులకు పలు సలహాలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ బస్వరాజ్ మరియు గోపాల మిత్రులు పండరి,గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



# జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బిజెపి పార్టీ పరిగి అసెంబ్లీ ఇన్చార్జి మారుతీ కిరణ్ బూనేటి

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా దోమ మండలం బిజెపి పార్టీ సీనియర్ నాయకులు మోత్కూర్ సారంగి మనుమరాలు మేఘనశ్రీ జన్మదిన వేడుకల్లో బిజెపి పార్టీ పరిగి అసెంబ్లీ ఇన్చార్జి మారుతి కిరణ్ బూనేటి పాల్గొని చిన్నారిని దీవించిన ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా బిజెపి పార్టీ కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, బిజెపి పార్టీ పరిగి నియోజకవర్గ నాయకులు వెంకటయ్య,జాజుల అనిల్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు నస్కల్ వెంకటయ్య, బిజెపి పార్టీ పూడూరు మండల ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ రెడ్డి, బీజేవైఎం అసెంబ్లీ కోకన్వీనర్ మనోహర్ గౌడ్,బిజెపి పార్టీ యువనాయకులు శివ కుమార్,నరసింహ,ప్రకాష్, కేశవులు,తదితరులు పాల్గొన్నారు.

# వండర్ల రావిర్యాల ఎక్స్ రోడ్డువద్ద రోడ్డు ప్రమాదం ఒకరు మృతి

### రావిర్యాల నుండి వేగంగా కొంగరకలాన్ వైపు వెళ్తున్న మట్టి లారీ

### కొంగరకలాన్ నుండి తుక్కుగూడ వైపు వెళ్తున్న బైకిస్ట్

### అతివేగంతో డి కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన శిలం కిరణ్

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్ ):** తుక్కుగూడ మున్సిపాలిటీ లో ఘోరమైన రోడ్డు ప్రమాదం వండర్లా ఎక్స్ రోడ్,రావిరాల సర్వీస్ రోడ్డు సమీపంలో శీలం కిరణ్ తండ్రి లక్ష్మయ్య, వయస్సు (23)సంవత్సరాలు, ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు.

కొంగరకలాన్ లో ఓ అద్దె ఇంట్లో ఉంటూ మహేశ్వరం మండలంలోని తుక్కుగూడ మున్సిపాలిటీ ఫ్యాబ్ సిటీలో ఓ కంపిణిలో ఉద్యోగం చేస్తున్నాడు, మృతుడు స్వస్థలం మిర్యాలగూడ నల్గొండ జిల్లా బైక్ నం టి జి 12 6989,నిందితుడి టిప్పర్ డ్రైవర్ వి.శ్రీను తండ్రి డోంగ్రియా వయస్సు 43 సంవత్సరాలు, డ్రైవర్.వెల్దండ,నాగర్ కర్నూల్ జిల్లా టిప్పర్ నం %ూ 07 ఖవీ% 8112,మృతుడు కొంగరకలాన్ సర్వీస్ రోడ్డు నుంచి తుక్కుగూడ వైపు బైక్‌పై వస్తుండగా వండర్ల ఎక్స్ రోడ్డు వద్దకు రాగానే ఎదురుగా టిప్పర్‌ను అతివేగంగా,నిర్లక్ష్యంగా నడిపి వాహనంపై ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఇబ్రహీం పట్నం మార్చురీకి తరలించారు.





# స్మశానవాటికను కబ్జాకు ప్రయత్నం చేస్తున్న గుర్తు తెలియని దుండగులు

### బసగూడ తండా మంఖాల్ ఆల్మస్ గూడ, మామిడి కుంటలోని స్మశాన వాటిక

### కబ్జాకు ప్రయత్నం చేసేవారిని కఠినంగా శిషంచాలని డిమాండ్



**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీలోని బాస గూడ తండాలో (10 వ వార్డు) లో దారుణం చోటుచేసుకుంది, తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో మంఖల్ అల్ మాస్ గూడ రెవిన్యూ,మామిడి కుంట 9, 10, సర్వేనెంబర్ లో గల భూమిలో గత 30, 40 సంవత్సరాల నుండి స్మశాన వాటిక లో దహన కార్యక్రమాలు చేస్తున్నామని తాండ వాసులు తెలిపారు. ఆ స్థలంలో కొత్తగా నిర్మించిన దహన వాటికను గుర్తు తెలియని దుండగులు జేసీబీ సహాయంతో కట్టడాన్ని కూల్చివేశారని ఆరోపించారు.స్థలాన్ని కూడా కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని తాండ వాసులు ఆందోళన చేపట్టారు. మా స్మశాన వాటిక కబ్జా చెయ్యాలని ప్రయత్నం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఏదీ ఏమైనా మా తాండవాసులు ఎవరు చనిపోయిన ఇక్కడే దహన%శీ% చేస్తామని ,బొందలు పెడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపాలిటీ 10వ.వార్డ్ కౌన్సిలర్ రవి నాయక్ తో పాటు తండా వాసులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**కోదాడ డిసెంబర్ 13**

**క్రైం మిర్రర్ :** కోదాడ మున్సిపల్ పరిధిలోని స్థానిక తమ్మర బండ పాలెం గ్రామములో న్యూ లైఫ్ అపోస్తులిక చర్చ్ పాస్టర్ కే శ్యాంసుందర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాస్టర్ కె జోసఫ్ , పాస్టర్ ప్రభుదాస్, జీవన్ జాకబ్, అనిల్ , సత్యరాజ్, ఉదయ్, మనోహర్ పాల్గొని క్రిమస్ సందేశాలు అందించి, కేక్ కటింగ్ మరియు క్యాండిల్ లైట్ సర్వీస్ నిర్వహించారు. యేసు క్రీస్తు ప్రేమను,శాంతిని ప్రపంచానికి బోధించిన మహనీయుడు అని కొనియాడారు. అనంతరం చర్చి యవ్వనస్తులు, క్రీస్తు జననం నాటికను ప్రదర్శించి క్రైస్తవ భక్తులను ఆకర్షించారు



# 38 పాయింట్ల తేడాతో...

## బెంగళూరు బుల్స్‌పై పుణేరి పల్టన్ ఘనవిజయం



పుణే: ప్రొ కబడ్డీ లీగ్‌లో డిఫెండింగ్ చాంపియన్ పుణేరి పల్టన్ 38 పాయింట్ల తేడాతో భారీ విజయం నమోదు చేసుకుంది. సొంతగడ్డపై శుక్రవారం జరిగిన ఈ పోరులో పల్టన్ 56%-%18 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌పై గెలుపొందింది. మ్యాచ్ ఆరంభం నుంచే సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన పల్టన్ ఓవరాల్‌గా 26 రెయిడ్ పాయింట్లు సాధించగా... బెంగళూరు బుల్స్ 11 రెయిడ్ పాయింట్లకే పరిమితమైంది. డిఫెన్స్‌లోనూ ఆకట్టుకున్న పల్టన్ 15 పాయింట్లతో మెరిస్తే... బుల్స్ 7 ట్యాకిల్ పాయింట్లే సాధించింది. ప్రత్యర్థిని నాలుగు సార్లు ఆలౌట్ చేసిన పల్టన్ 8 పాయింట్లు ఖాతాలో వేసుకుంటే... బుల్స్ ఒక్కసారి కూడా ప్రత్యర్థిని ఆలౌట్ చేయలేకపోయింది. పల్టన్ తరఫున రెయిడర్లు ఆకాశ్ షిండే, మోహిత్ గోయత్, ఆర్యవర్ధన్ తలా 8 పాయింట్లు సాధించారు. బెంగళూరు బుల్స్ తరఫున స్టార్ రెయిడర్ ప్రదీప్ నర్వాల్ 7 పాయింట్లతో పోరాడినా ఫలితం లేకపోయింది. తాజా సీజన్‌లో 19 మ్యాచ్‌లు ఆడిన పుణేరి పల్టన్ 8 విజయాలు, 8 పరాజయాలు, 3 ‘టై’లతో 54 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో ఏడో స్థానంలో నిలిచింది. మరోవైపు ఈ సీజన్‌లో పేలవ ప్రదర్శన కనబరుస్తున్న బెంగళూరు బుల్స్ 19 మ్యాచ్‌ల్లో రెండే విజయాలతో పట్టిక అట్టడుగున కొనసాగుతోంది. శుక్రవారమే జరిగిన మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 42%-%38 పాయింట్ల తేడాతో తమిళ్ తలైవాస్‌పై గెలుపొందింది. పట్నా తరఫున అయాన్ 13, దేవాంక్ 12 పాయింట్లతో రాణించగా... తలైవాస్ తరఫున మోయిన్ 11 పాయింట్లతో పోరాడాడు. హరియాణా స్టీలర్స్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.



# గాయత్రి జోడీ నిష్క్రమణ

## బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్

హాంగ్జౌ: ప్రతిష్ఠాత్మక బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీలో భారత యువ ద్వయం గాయత్రి గోపీచంద్, త్రిసా జాలీ జోడీ పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్ గ్రూపు-ఏలో గోపీచంద్, త్రిసా ద్వయం 17-21, 13-21తో జపాన్‌కు చెందిన మత్సుయమ, చిహారు జంట చేతిలో ఓడింది. ఇటీవలే సయ్యద్ మోడీ టోర్నీ గెలిచిన జోరు కనిపించిన గాయత్రి, త్రిసా%ౌ%ప్రపంచ నంబర్‌ఫోర్ జోడీ నుంచి గట్టి పోటీ ఎదురైంది. వీరి నిష్క్రమణతో భారత పోరు ముగిసింది. సెమీస్‌లో సహజ షోలాపూర్(మహారాష్ట్ర) వేదికగా జరుగుతున్న ఐటీఎఫ్ 35కే టెన్నిస్ టోర్నీలో తెలంగాణ స్టార్ ప్లేయర్ సహజ యమ్లపల్లి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో సహజ 6-3, 6-0తో యశిన ఎక్టరీనా(రష్యా)పై అద్భుత విజయం సాధించింది.


# సెమీస్‌లో సహజ



హైదరాబాద్, ఆట ప్రతినిధి : షోలాపూర్(మహారాష్ట్ర) వేదికగా జరుగుతున్న ఐటీఎఫ్ 35కే టెన్నిస్ టోర్నీలో తెలంగాణ స్టార్ ప్లేయర్ సహజ యమ్లపల్లి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో సహజ 6-3, 6-0తో యశిన ఎక్టరీనా(రష్యా)పై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే తనదైన దూకుడు కొనసాగించిన సహజ..వరుస సెట్లలో ప్రత్యర్థిని మట్టికరిపించింది.

# ‘విజయోత్సవం’

## విజేతగా బిజీ బిజీగా గడిపిన చాంపియన్ ప్లేయర్



‘ట్రోఫీ చూడటానికి చాలా బాగుంది. కానీ నేను ఇప్పుడు దీనిని ముట్టుకోను. బహుమతి ప్రదానోత్సవ సమయంలోనే అందుకుంటాను’... విశ్వ విజేతగా నిలిచిన తర్వాతి రోజు కొత్త ఉత్సాహంతో కనిపిస్తూ గుకేశ్ చెప్పిన మాట ఇది. ముగింపు కార్యక్రమానికి కొద్దిసేపు ముందు జరిగిన ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో ఇది చోటు చేసుకుంది. వరల్డ్ చాంపియన్‌షిప్ ట్రోఫీని ఇంత దగ్గరగా చూడటం ఇదే మొదటిసారి అంటూ గుకేశ్ తన ఆనందాన్ని ప్రదర్శించాడు. ఫొటో షూట్ సమయంలోనూ అతను దానిని ముట్టుకోలేదు. ప్రపంచ చాంపియన్ హోదాలో శుక్రవారం గుకేశ్ బిజీబిజీగా గడిపాడు. ప్రపంచ చెస్ సమాఖ్య (ఫిడే) నిర్ణయించిన అధికారిక కార్యక్రమాలు, ఇంటర్వ్యూలతో పాటు పెద్ద సంఖ్యలో చెస్ అభిమానులకు అతను ఆటోగ్రాఫ్‌లు ఇచ్చాడు.

వీరిలో భారత అభిమానులతో పాటు సింగపూర్‌కు చెందిన చదరంగ ఔత్సాహికులు కూడా ఉన్నారు. తాము వెంట తెచ్చుకున్న చెస్ బోర్డులపై వారు వరల్డ్ చాంపియన్ ఆటోగ్రాఫ్‌ను తీసుకున్నారు. ఆటోగ్రాఫ్ కోసం నిలబడిన వారి సంఖ్య అనంతంగా సాగింది. ఆ తర్వాత గుకేశ్ ఎంతగానో ఎదురు చూసిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ‘ఫిడే’ అధ్యక్షుడు అర్కాడీ వొర్కొవిచ్ జగజ్జేత గుకేశ్‌కు ట్రోఫీతో పాటు బంగారు పతకాన్ని, ప్రైజ్‌మనీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన భారత గ్రాండ్‌మాస్టర్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. అద్భుతమైన ఆట, చిరకాలం గుర్తుండిపోయే ప్రదర్శనగా గుకేశ్ విజయాన్ని ఆయన అభివర్ణించారు. తన విజయానందాన్ని సోషల్ మీడియాలో ప్రకటిస్తూ...‘18వ ఏట 18వ చాంపియన్’ అంటూ గుకేశ్ ట్వీట్ చేశాడు. ఇలాంటి క్షణం కోసం ఇంతకాలం ఎదురు చూశాను. ఇలాంటి రోజు కోసమే ప్రతీ రోజూ నిద్ర లేచేవాడిని. ఇప్పుడు ఈ ట్రోఫీని నా చేతుల్లో తీసుకున్న ఆనందంతో పోలిస్తే నా జీవితంలో ఏదీ సాటి రాదు. నా ప్రయాణం ఒక కలలా సాగింది. ఈ క్రమంలో ఎన్నో ఎత్తుపల్లాలు, సవాళ్లు ఎదురయ్యాయి. కానీ నా చుట్టూ ఉన్నవారి అండతో అన్నింటినీ అధిగమించగలిగాను. కష్టాల్లో ఉన్న సమయంలో పరిష్కారం లభించనప్పుడు దేవుడే నాకు తగిన దారి చూపించాడు.

# ఆధిక్యంలోకి వెళతారా!

## నేటి నుంచి ఆస్ట్రేలియాతో భారత్ మూడో టెస్టు



ఉదయం గం. 5:50 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

బ్రిస్బేన్: ‘బోర్డర్ -గావస్కర్ ట్రోఫీ’లో భాగంగా భారత్, ఆస్ట్రేలియా మధ్య నేటి నుంచి బ్రిస్బేన్‌లో మూడో టెస్టు ప్రారంభం కానుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇరు జట్లు చెరో విజయంతో 1-1తో సమఉజ్జీలుగా ఉండగా... పేస్‌కు స్వర్గధామమైన బ్రిస్బేన్‌లో ఎవరు పైచేయి సాధిస్తారనేది కీలకంగా మారింది. అడిలైడ్‌లో జరిగిన రెండో టెస్టులో భారత బ్యాటర్లు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోవడంతో... టీమిండియాకు పరాజయం తప్పకపోగా... ఈ మ్యాచ్‌లో వాటిని అధిగమించి విజయం సాధించాలని మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. తొలి టెస్టులో సెంచరీ చేసినప్పటికీ... ఆఫ్‌స్టంప్ అవతల పడుతున్న బంతులను ఎదుర్కోవడంలో ఇబ్బంది పడుతున్న విరాట్ కోహ్లి నుంచి సాధికారిక ఇన్నింగ్స్ రావాల్సి ఉంది. క గత కొంత కాలంగా సుదీర్ఘ ఫార్మాట్‌లో పేలవ ప్రదర్శన కనబరుస్తున్న రోహిత్ శర్మ తిరిగి ఓపెనింగ్ చేయడం ఖాయమే. మరోవైపు గత మ్యాచ్‌లో విజయంతో ఆస్ట్రేలియా ఆత్మవిశ్వాసంతో ఉన్నా... స్టీవ్ స్మిత్, ఉస్మాన్ ఖ్వాజా పేలవ ఫామ్ ఆసీస్‌ను ఇబ్బంది పెడుతోంది.

### ఒత్తిడిలో రోహిత్, కోహ్లి

కెరీర్‌లో దాదాపు చివరి ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత సీనియర్ ప్లేయర్లు రోహిత్ శర్మ, కోహ్లి ఒత్తిడిలో కనిపిస్తున్నారు. తొలి టెస్టుకు అందుబాటులో లేని రోహిత్... అడిలైడ్‌లో మిడిలార్డర్‌లో బరిలోకి దిగి ప్రభావం చూపలేకపోయాడు. దీంతో మరోసారి రోహిత్ ఇన్నింగ్స్ ఆరంభించనుండగా... కేఎల్ రాహుల్ మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేయనున్నాడు. ఏకైక స్పిన్నర్‌గా అశ్విన్, సుందర్, జడేజా మధ్య పోటీ ఉన్నా... గతంలో ఇక్కడ మెరుగైన ప్రదర్శన చేసిన వాషింగ్టన్ సుందర్ వైపు మొగ్గు చూపొచ్చు. ఇక మూడో పేసర్‌గా హర్షిత్ రాణా స్థానంలో ఆకాశ్‌దీప్ సింగ్‌కు అవకాశం దక్కవచ్చు.

### ఆత్మవిశ్వాసంలో ఆస్ట్రేలియా..

సొంతగడ్డపై సమష్టి ప్రదర్శనతో ఆకట్టుకున్న ఆస్ట్రేలియా అదే జోరులో సిరీస్‌లో ఆధిక్యం సాధించాలనే పట్టుదలతో ఉంది. తొలి మ్యాచ్‌లో ఘోర పరాజయం ఎదురైనా... అడిలైడ్‌లో హెడ్ మెరుపు సెంచరీతో చెలరేగడంతో కంగారూలు గాడిన పడ్డారు. అయితే స్టార్ ఆటగాడు స్టీవ్ స్మిత్‌తో పాటు ఉస్మాన్ ఖ్వాజా, మెక్‌స్వీనీ, మిషెల్ మార్‌ష్, అలెక్స్ కేరీ రాణించాల్సిన అవసరముంది. లబుషేన్ గత మ్యాచ్‌లో అర్ధశతకంతో ఆకట్టుకున్నా... పూర్తి నియంత్రణతో కనిపించలేదు. బౌలింగ్‌లో మాత్రం ఆసీస్‌కు ఎలాంటి ఇబ్బందులు కనిపించడం లేదు.


GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.